


# విజయభాను




విశాఖపట్నం, ఆదివారం 23-02-2020 VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM సంపుటి : 43 సంచిక : 144 పేజీలు : 8 వెల : 1 రూపాయి



## చట్టమే అత్యున్నతం
# న్యాయ వ్యవస్థే సుప్రీం

- నిరంతరం అధ్యయనంతో పరిష్కార మార్గాలు
- శాసన, న్యాయశాఖలు పరస్పరం గౌరవించుకోవాలి
- అంతర్జాతీయ న్యాయ సదస్సులో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ : చట్టమనేది రాజులకే రారాజు.. చట్టమే అత్యున్నతమైనది అని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. భారతదేశానికి న్యాయ వ్యవస్థనే సుప్రీం అని ఆయన స్పష్టం చేశారు. దేశ రాజధాని ఢిల్లీలోని సుప్రీంకోర్టు ప్రాంగణంలో అంతర్జాతీయ న్యాయ సదస్సును ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన న్యాయనిపుణులకు ధన్యవాదాలు తెలిపారు మోదీ. ఇటీవల అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పులకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పులను 130 కోట్ల మంది భారతీయులు అంగీకరించారని మోదీ తెలిపారు. మహాత్మాగాంధీ న్యాయవాది.. గాంధీ ఆచరించిన మార్గంతో న్యాయవ్యవస్థకు పునాది వేశారు. మహాత్మాగాంధీ తన జీవితాన్ని సత్యం, సేవా మార్గంలో కొనసాగించారు. గాంధీజీ తన ఆత్మకథలో, తన జీవితంలో పోరాడిన మొదటి దావా గురించి రాశారు అని మోదీ గుర్తు చేశారు. తరువాయి 2లో..



# అవకతవకలపై విచారణ కక్షసాధింపా!?



- తప్పుడు ఆరోపణలు ప్రజలు హర్షించరు
- మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం: అధికారులపై ఏసీబీ దాడులు జరగడం సహజం.. కానీ మాజీ ముఖ్యమంత్రి పీఎస్ శ్రీనివాస్ ఇంటిపై దాడులు జరగడం తన రాజకీయ జీవితంలో తొలిసారి చూశానని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విజయనగరంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఐటీ సోదాలకు సమాధానం చెప్పిన తర్వాతే చంద్రబాబు యాత్ర చేయాలని డిమాండ్ చేశారు. అమరావతి పేరుతో దోపిడీ జరిగిందని ఏడు నెలల క్రితమే గుర్తించామని.. భూ సేకరణలో అవకతవకలు జరిగాయని అప్పుడే చెప్పామని పేర్కొన్నారు.

అవకతవకలపై విచారణ చేయడం కక్ష సాధింపు ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను ఎత్తిచూపితే తప్పు అని అనడం సరికాదన్నారు. గత ప్రభుత్వంలో బీసీ మంత్రులపై టార్గెట్ అనడం హాస్యాస్పదమని తరువాయి 2లో..

# సోమరితనంతో పాటు జంక్ ఫుడ్ ప్రభావం పోవాలి

- విధ్వంసం సమాజానికి మంచిది కాదు
- మాతృభాషను కాపాడుకోవాలి
- ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచన



హైదరాబాద్: ప్రజల జీవన శైలివల్లే సమాజంలో వింత జబ్బులు వస్తున్నాయని, ఆహారపు అలవాట్లు మారాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ప్రజల్లో సోమరితనంతో పాటు జంక్ ఫుడ్ ప్రభావం పోవాలని సూచించారు. శనివారం ఆయన ముచ్చింతల్ స్వర్ణభారత్ ట్రస్ట్, యశోద ఆస్పత్రి సంయుక్త అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మ అవార్డుల గ్రహీతలు పీవీ సింధు, భాష్యం విజయసారథి, చింతల వెంకట్ రెడ్డిని సన్మానించారు. అనంతరం వెంకయ్యనాయుడు మాట్లాడుతూ .. బ్యాలెట్ ద్వారా ఎంత పెద్దవారినైనా దించేయొచ్చు. కొందరు సృష్టిస్తున్న హింసను తరువాయి 2లో..

# మళ్లీ విజృంభిస్తోన్న స్వైన్ ఫ్లూ..!

- గాంధీ ఆసుపత్రిలో మళ్లీ కేసులు నమోదు
- ఒక వైపు కరోనా.. మరో వైపు స్వైన్ ఫ్లూ



హైదరాబాద్: ఒక వైపు కరోనా వైరస్ అనుమానాలు వణికిస్తుంటే.. మరో వైపు స్వైన్ ఫ్లూ కేసులు నమోదు కావడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. సాధారణంగా స్వైన్ ఫ్లూ ప్రభావం చలికాలంలోనే ఉంటుంది.. కానీ సీజన్ కాని సీజన్‌లో స్వైన్ ఫ్లూ చాపకింద నీరులా విస్తరిస్తోంది.

గాంధీ ఆసుపత్రిలో మళ్లీ స్వైన్ ఫ్లూ కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటి వరకూ 15 స్వైన్ ఫ్లూ కేసులు నమోదవ్వగా.. ఫిబ్రవరి నెలలోనే 8 కేసులు నమోదయ్యాయి. జలుబు, జ్వరం, దగ్గు, శ్వాస కోశ సమస్యలతో కరోనా వైరస్ అనుమానంతో ఆసుపత్రులకు వెళ్తున్నవారికి పరీక్షలు నిర్వహిస్తే స్వైన్ ఫ్లూ బయటపడుతుంది.


### చలి తీవ్రత తగ్గిన ప్రభావం తగ్గలేదు..

వేసవి ప్రారంభం కాగానే వైరస్ ప్రభావం తగ్గుతుంది. కానీ చలి తీవ్రత తగ్గిన స్వైన్ ఫ్లూ తీవ్రత తగ్గలేదు. గత ఏడాది స్వైన్ ఫ్లూతో పది మంది మృతి చెందిన సంగతి తెలిసిందే.. సాధారణంగా శీతాకాలంలో విజృంభించే స్వైన్ ఫ్లూ వ్యాధి.. ప్రస్తుత వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల వల్ల దాని ప్రభావం తగ్గలేదని వైద్యులు చెబుతున్నారు.

స్వైన్ ఫ్లూ బారి నుంచి తప్పించు కోవడానికి తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచిస్తున్నారు.

# ఇసుక విధానం పేరుతో భారీస్థాయిలో అవకతవకలు

- మీ వైఫల్యంతో మా ప్రభుత్వానికి చెడ్డపేరు
- ఆనాటి అధికారులు పట్టించుకోలేదు
- డిప్యూటీ సీఎం పిల్లి సుభాష్ చంద్రబోస్



తూర్పు గోదావరి: ఉచిత ఇసుక పాలసీ అమలు అధికారులపై డిప్యూటీ సీఎం పిల్లి సుభాష్ చంద్రబోస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడలో శనివారం అధికారులతో ఏర్పాటు చేసిన మంత్రుల సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎంతోపాటు, పినిపే విశ్వరూప్, కలెక్టర్ మొరళీధర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పిల్లి సుభాష్ మాట్లాడుతూ.. ఉచిత ఇసుక పంపిణీలో అధికారుల వైఫల్యంతో ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుందని మండిపడ్డారు.

ఉచిత ఇసుక విధానంతో క్షేత్రస్థాయిలో పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతున్నాయని, దీనిని అధికారులు పట్టించుకోవడం లేదంటూ పలు శాఖల అధికారులపై పిల్లి సుభాష్ అసహనం వ్యక్తం చేశారు.

# సీఎం కప్ పేరుతో క్రీడలు నిర్వహిస్తాం

తిరుమల: సీఎం కప్ పేరుతో గ్రామీణ ప్రాంతాల్లోని స్థానిక క్రీడాకారులను ప్రోత్సహించేలా క్రీడలు నిర్వహిస్తామని పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాస్ అన్నారు. ఆయన శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్వామివారి ఆశీస్సులతో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని వేడుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో క్రీడలు నిర్వహించి ఫైనల్‌ను విజయవాడ లేదా వైజాగ్‌లో నిర్వహిస్తామని అవంతి పేర్కొన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహుమతి అందచేస్తారని ఆయన తెలిపారు. ప్రైజ్‌మనీ తరువాయి 2లో..




# సంక్షేమ యుగానికి నాందిగా ఉగాది

## ప్రభుత్వ సలహాదారు ఎం.శామ్యూల్



విశాఖపట్నం: పేదలందరికీ ఇల్లు కార్యక్రమంతో రానున్న ఉగాది పండుగ మరో సంక్షేమ యుగానికి నాంది కాగలదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎం. శామ్యూల్ పేర్కొన్నారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇల్లు కార్యక్రమంపై జిల్లా యంత్రాంగంతో సమీక్షించారు. కార్యక్రమం అమలులో విశాఖపట్నం జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలులో పేదలందరికీ ఇళ్లు ఇవ్వడం ఒక ప్రధాన కార్యక్రమమని తెలిపారు. ఈ కార్యక్రమం పురోగతి జిల్లాలో మెరుగ్గా ఉందన్నారు. క్షేత్రస్థాయిలో అక్కడక్కడా సమస్యలు ఉన్నా, అధికార యంత్రాంగం వాటి పరిష్కారానికి అంకితభావంతో పని చేస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వం పేదలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ప్రభుత్వం అధికార యంత్రాంగంతోనే తన ఆలోచనలను అమలు చేస్తోందన్నారు. మంచి ఆలోచనలతో సంక్షేమ కార్యక్రమాలను ప్రజలం దరికీ అందించాలని పిలుపునిచ్చారు. నిష్పక్ష పాతంగా పారదర్శకంగా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగ నియామకాలను జరపామన్నారు. ముఖ్యమంత్రి దార్శనికత కలవాలని ఆయన ప్రణాళికలను సమర్ధ వంతంగా అమలు పరచడం అధికారుల బాధ్యతగా ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మితమయ్యే ఇళ్ల సముదాయాలకు మౌలిక వసతులతో బాటుగా తరువాయి 2లో..

# ఉగాది నాటికి 25 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ...

## డిప్యూటీ సీఎం పిల్లి సుభాష్ చంద్రబోస్



కాకినాడ: ఉగాదికి అందరికి ఇళ్లు పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ నుంచి ప్రారంభిస్తారని డిప్యూటీ సీఎం పిల్లి సుభాష్ చంద్రబోస్ తెలిపారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. గత 40 ఏళ్లుగా దేశంలో ఏ రాష్ట్రంలో 20 లక్షలకు పైగా ఇళ్లు ఇచ్చిందిలేదన్నారు. 25 లక్షల మందికి ఇంటి స్థలాలు ఇవ్వడం ప్రపంచ రికార్డు అవుతుందన్నారు. తప్పనిసరి అయితే తప్ప.. అసైన్డ్ భూములను తీసుకోవద్దని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారని పేర్కొన్నారు. స్వచ్ఛందం గా భూములు ఇచ్చేవారికి పరిహారం ఇచ్చి భూ సేకరణ చేస్తున్నామని వివరించారు. గోదావరి డెల్టాకు రబీకి కావాల్సిన నీరు ఉందన్నారు. అయితే పోలవరం ప్రాజెక్టు వద్ద కాపర్ డ్యామ్ వద్ద ఏర్పాటు చేసిన పైపుల వల్ల నీరు దిగువకు తక్కువగా వస్తుందన్నారు. ఈ సమస్య పరిష్కారం అయిందన్నారు. జిల్లాలో ఇసుక సమస్యను తీర్చేందుకు అనుమతులు ఉన్న రీచ్ లను ప్రారంభించాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.

3.50 లక్షల మంది లబ్ధిదారులు గుర్తింపు..

అందరికి ఇళ్లు పథకంలో జిల్లా వ్యాప్తంగా 3.50 లక్షల మంది లబ్ధిదారులను గుర్తించామని జిల్లా కలెక్టర్ మురళీధర్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో 7,700 ఎకరాల భూమి అవసరం అవుతుందన్నారు. 2 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడ భూసేకరణ జరపలేదని పేర్కొన్నారు. విద్య, వైద్య, దేవాదాయ, వక్ఫ్ బోర్డు భూములను సేకరించలేదని వివరించారు. అసైన్డ్ భూములను రైతుల అంగీకారంతోనే అవార్డు ప్రకటించామని చెప్పారు.

అది వాస్తవం కాదు.. తెలుగు యునివర్సిటీలో 10 మంది విద్యార్థులు, 14 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారని, ఆ యూనివర్శిటీకి 25 ఎకరాల భూమి అవసరం ఉందా లేదా అనేది పరిశీలిస్తున్నామన్నారు.

యునివర్శిటీకి నన్నయ్య యునివర్శిటీలో 5 ఎకరాలు కేటాయించాలని ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తున్నామని వెల్లడించారు. యునివర్సిటీ భూములపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. బలవంతపు భూసేకరణ చేస్తున్నామనేది వాస్తవం కాదని.. మీడియా ఇలాంటి వార్తలు రాసేటపుడు అధికారుల నుండి వివరణ తీసుకోవాలని కలెక్టర్ మురళీధర్ రెడ్డి కోరారు.

## భూ రికార్డుల ప్యూరిఫికేషన్ పక్కాగా చేపట్టాలి

### ఇన్-ఛార్జి కలెక్టర్ కె.శ్రీనివాసులు




శ్రీకాకుళం : భూ రికార్డుల ప్యూరిఫికేషన్ కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని ఇన్-ఛార్జ్ కలెక్టర్ కె.శ్రీనివాసులు తహశీల్దారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సి.సి.ఎల్.ఎ.కార్యదర్శి హరినారాయణ చక్రవర్తి.ఆర్. భూ రికార్డుల ప్యూరిఫికేషన్ కార్య క్రమంపై తహశీల్దారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఫసలీ అడంగల్, డేటా వెరిఫికేషన్, వెబ్ ల్యాండ్ కంప్యూటరైజేషన్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెవిన్యూ శాఖామాత్యులు మరియు డిప్యూటీ సి.ఎం. భూ రికార్డుల ప్యూరిఫికేషన్ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత నిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు నిక్కచ్చి భూమి రికార్డులను అందచేయు నిమిత్తం భూమి రికార్డుల ప్యూరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదన్నారు. ఒరిజినల్ ఆర్.ఎస్.ఆర్. తో వెబ్ ల్యాండ్ లో కంప్యూటర్ చేయబడిన ఆర్.ఎస్.ఆర్.తో నిక్కచ్చి పరిశీలన చేసి వాటిని సరిచేయాలన్నారు అన్ని గ్రామాలు వెబ్ ల్యాండ్ పరిధిలోకి రావాలన్నారు. ఒరిజినల్ ఆర్.ఎస్.ఆర్.తో సరిపోని రికార్డుల నిమిత్తం వి.ఆర్.ఓ.లు, సర్వేయర్లతో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి సరి చేయాలన్నారు.

ఆర్.ఐ.లు రెవెన్యూ సెటిల్ మెంట్ రికార్డులను పక్కాగా పరిశీలించాలన్నారు. ఎఫ్.ఎం.బి.తో సరిచూడాలని తెలిపారు. ఒక రైతుకు గ్రామంలో ఒకే ఖాతా వుండాలన్నారు. రికార్డులలో ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులను నమోదు చేసి పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రతీ ఏటా జమాబందీ నిర్వహించాలన్నారు. తహశీల్దారులు, సర్వేయర్లు, వి.ఆర్.ఒ.లు సంయుక్తంగా పని చేసి భూమి రికార్డుల ప్యూరిఫికేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు.

ఈ సమావేశానికి ఇన్-ఛార్జి కలెక్టర్ కె.శ్రీనివాసులు, సి.సి.ఎల్.ఎ ఒ.ఎస్.డి. గోవిందరాజు, జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి, శ్రీకాకుళం, పాలకొండ, టెక్కలి రెవెన్యూ డివిజనల్ అధికారులు ఎం.వి.రమణ, టి.వి.ఎస్.జి.కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్సు ఎ.డి. వై.ఎస్.వెంకటేశ్వర రావు, ఎస్.డి.సి.లు, తహశీల్దారులు, తదితరులు హాజరైనారు.

## మార్చి 22 నుంచి ఏప్రిల్ 5 వరకూ ఫిడ్జి అడ్మిషన్ టెస్ట్ విశాఖఎడ్యుకేష్

విశాఖపట్నం : విద్యార్థుల కోసం మార్చి 22 నుంచి ఏప్రిల్ 5 తేదీ వరకూ ఫి అడ్మిషన్స్ టెస్ట్ నిర్వహించ నున్నట్లు ఫి సంస్థ డైరెక్టర్ ఆర్.ఎల్. త్రిఖ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు అడ్మిషన్ టెస్ట్ డాట్ ఫిడ్జి టాట్ కామ్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పరీక్షకు ఒక రోజు ముందుగా గాని, ఫిడ్జి సెంటర్ కు డైరెక్టర్ గా వెల్లి విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. 6 నుంచి 12 వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ టెస్ట్ కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా తెలిపారు.

ఫిడ్జి మొదటిసారి దరఖాస్తు చోసుకున్నట్లు అయితే సర్వీస్ టాక్స్ కలిపి 900 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని, ఇంతకు ముందు టెస్ట్ రాసిటన్లు అయితే 800 రూపాయలు విద్యార్థులు చెల్లించాల్సి ఉంటు ఒదన్నారు. రసైన్స్, లెక్కలు,స్కిల్స్ తదితర అంశాల్లో టెస్ట్ ఉంటుందన్నారు.

## నారాయణరావుకు పదవితో పార్టీ మరింత బలోపేతం

### కాంగ్రెస్ నేత తోట వాసుదేవరావు



విశాఖపట్నం : పీసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నారాయణ రావుకు బాధ్యతను అప్పగించడం నగర కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి తోట వాసుదేవరావు ఆనందం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రేటర్ విశాఖ నగరంలో ఎస్సీ ఎస్టీ బీసీలకు అన్యాయం జరుగుతున్న ఈ నేపథ్యంలో నారాయణరావుకు ఈ బాధ్యతలు ఇవ్వడం అణగారిన వర్గాలకు బీసీలకు న్యాయం జరుగుతుందని ఆనందం వ్యక్తం చేశారు. ఆయన హయాంలో కాంగ్రెస్ పార్టీ రానున్న కాలంలో ఓ వైపు వస్తోందని వెల్లడించారు. ఆయనకు బాధ్యతలు అప్ప చెప్పిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాకే శైలజనాథ్ పీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తులసి రెడ్డి,మస్తాన్ వల్లికి, తోట వాసుదేవరావు ధన్యవాదాలు తెలిపారు.

## మహాశివరాత్రి.. సముద్ర స్నానాలు.. ప్రసాదాల వితరణ

విశాఖపట్నం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉపవాసం అనంతరం సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులకు ప్రసాద పంపిణీ కార్యక్రమంలో వైసీపీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

6వ వార్డ్ పరిధిలో ఈస్ట్ యువజన విభాగం అధ్యక్షుడు బాయిన సునీల్ ఏర్పాటు చేసిన ప్రసాదాల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ ఎంవివి సత్యనారాయణతో వంశీకృష్ణ పాల్గొని ప్రసాదం పంపిణీ చేశారు. 7వ వార్డ్‌లో ప్రసాదాల పంపిణీలో వంశీకృష్ణతో ఈస్ట్ ఇంచార్జి అక్కరమాని విజయనిర్మల. 17వ వార్డ్ జాలరిపేట వద్ద పంపిణీ కార్యక్రమంలో వైసీపీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ . పై కార్యక్రమాల్లో వైసీపీ సీనియర్లు, పార్టీ శ్రేణులు, భక్తులు పాల్గొన్నారు.





## చట్టమే అత్యున్నతం.. న్యాయవ్యవస్థే సుప్రీం

ప్రపంచం అనేక సమస్యలు ఎదుర్కొంటోంది అని ప్రధాని పేర్కొన్నారు. దేశంలో సంక్లిష్ట పరిస్థితుల పరిష్కారానికి న్యాయవ్యవస్థ కృషి చేస్తోంది. నిరంతరం అధ్యయనంతోనే కొత్త విషయాలు తెలుసుకోవచ్చు. వ్యవస్థలో మార్పులు హేతుబద్ధంగా, చట్ట ప్రకారం ఉండాలి. భారతదేశ శాసన, న్యాయశాఖలు పరస్పరం గౌరవించుకుంటాయి. 70 ఏళ్ల భారత రాజకీయ వ్యవస్థలో మహిళలకు సముచిత ప్రాధాన్యం కల్పించాం. మహిళలకు ఓటు హక్కు కల్పించిన ప్రముఖ దేశాల్లో భారత్ ఒకటి అని మోదీ పేర్కొన్నారు. 135 కోట్ల మంది భారతీయులు తమ సమస్యలను న్యాయవ్యవస్థ ద్వారానే పరిష్కరించుకుంటున్నారు. లింగ సమానత్వం లేనిది సంపూర్ణ వికాసం ఉండదన్నారు మోదీ. బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం కేవలం లాయర్ల డాక్యుమెంట్ మాత్రమే కాదు.. అది అందరి జీవితాలకు మార్గదర్శకం అని అన్నారు. దేశంలో పర్యావరణ పరిరక్షణకు సుప్రీం తన తీర్పులతో ఎంతో సహకరించిందన్నారు. మారుతున్న సాంకేతికతను న్యాయవ్యవస్థ అందిపుచ్చుకోవాలి అని మోదీ సూచించారు.

## సోమరితనంతో పాటు జంక్ ఫుడ్ ప్రభావం పోవాలి

ప్రజలు చూస్తూ ఊరుకోవడం మంచిది కాదు. విధ్వంసం సమాజానికి మంచిది కాదు. విధ్వంసాన్ని ప్రోత్సహించడం కూడా తప్పే. 12 మంది రైతులకు పద్మ అవార్డులు రావడం గొప్ప విషయం. పేరు తెచ్చే వారిని సన్మానిస్తే సమాజం తనను తాను గౌరవించుకున్నట్టే. ప్రజల జీవనశైలి వల్లే సమాజంలో వింత జబ్బులు వస్తున్నాయి. ప్రజల్లో సోమరితనం, జంక్ ఫుడ్ ప్రభావం పోవాలి అన్నారు. మాతృభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ. పేదలకు దూరమైన వైద్యాన్ని దగ్గర చేయడమే స్వర్ణభారత్ ట్రస్ట్ లక్ష్యం. విద్య, వైద్యం, నైపుణ్యం పెంపొందించడమే ట్రస్ట్ ఉద్దేశం. ప్రకృతిని నిర్లక్ష్యం చేసినందుకు మానవాళిపై ఉగ్రరూపం చూపిస్తోంది. దేశం వేగంగా ముందుకెళ్తున్నా ఇంకా చాలామంది వెనుకబడే ఉన్నారు. మాతృభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది. మాతృభాషలో ప్రతిభ ఉంటేనే ఇతర భాషలను వేగంగా నేర్చుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, భాజపా నేతలు లక్ష్మణ్, రాంచందర్ రావు, కామినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు .

## అవకతవకలపై విచారణ కక్షసాధింపా!?

అన్నారు. తాను బీసీ మంత్రినేనని.. గతంలో పదేళ్లు మంత్రిగా పనిచేశానని తెలిపారు. చంద్రబాబు దగ్గర ఉన్నవారే బీసీ నేతలా.. తాము కాదా అని బొత్స ప్రశ్నించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు మాట్లాడే ముందు ఆలోచించి మాట్లాడాలని.. తప్పుడు ఆరోపణలను ప్రజలు హర్షించరని మంత్రి బొత్స పేర్కొన్నారు.

24న వసతి దీవెన ప్రారంభం..

ఈ నెల 24న వసతి దీవెన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయనగరంలో ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు. సుమారు 50వేల మంది విద్యార్థులు జిల్లాలో లబ్ధి పొందనున్నారని వెల్లడించారు. జిల్లాలో సుమారు 58 వేల మందిని ఇళ్లు, ఇంటి స్థలాల లబ్ధిదారులుగా గుర్తించామని పేర్కొన్నారు. ఉగాది నాటికి ఇళ్ల స్థలాల పంపిణీకి అవసరమైన స్థల సేకరణ జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ బలవంత భూ సేకరణ జరగలేదని.. ప్రతిపక్షాల ఆరోపణల్లో వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. పేదలందరికి ఇళ్లు ఇవ్వాలన్న లక్ష్యం తో ప్రభుత్వం ముందుకెళ్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం దగ్గర సరిపడా స్థలం ఉందని.. ఎటువంటి సమస్య లేదని చెప్పారు. ఎక్కడైనా స్థలం చాలకపోతే ప్రభుత్వం నిబంధనల ప్రకారం డబ్బులు చెల్లించి కొనుగోలు చేస్తోందని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో భూసేకరణ ఎలా జరిగిందో అందరికి తెలుసునని.. జిరాయితి కి ఒకలాగా, డి పట్టాకి మరోలా ఇచ్చి ప్రజలకు అన్యాయం చేశారని విమర్శించారు. వైఎస్ జగన్ ప్రభుత్వం పారదర్శకంగా ముందుకెళ్తుందని ఇందులో ఎటువంటి అనుమానం లేదని మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు.

## సంక్షేమ యుగానికి నాందిగా ఉగాది

పార్కు ఆటస్థలం వంటివి కూడా కల్పించి గతంలో ఇందిరమ్మ కాలనీ లానే మోడల్ కాలనీలను రూపొందించాలన్నారు.తాశిల్దారు, ఎంపీడీవో, హౌసింగ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామాలలో తలెత్తుతున్న సమస్యలను కలెక్టరు, జాయింట్ కలెక్టర్ల దృష్టికి తీసుకువెళ్లి ఎప్పటికప్పుడు ఇబ్బందులను పరిష్కరించాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ మాట్లాడుతూ ఇప్పటినుండి జాయింట్ కలెక్టర్లు ఇద్దరూ ప్రతిరోజు సంబంధిత తహసీల్దార్లు, ఆర్డిఓలతో కార్యక్రమం పురోగతిపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తారని తెలిపారు. మార్చి 10వ తారీఖు నాటికి జిల్లాలో అవసరమైన ప్లాట్లు పూర్తవ్వాలి అన్నారు. ప్లాట్ల కేటాయింపు అందరినీ సంతృప్తి పరిచేలా లాటరీ పద్ధతిలో జరగాలన్నారు. ఇళ్ల పట్టాను ఆడవారి పేరున ఇవ్వాలని ప్రభుత్వ నిర్దేశాలును అనుసరించి పట్టాను తాసిల్దారు జారీచేసి రిజిస్ట్రార్‌కు పంపిస్తారని చెప్పారు. అదే విధంగా భూమి తీసుకున్న రైతులు కూడా సంతృప్తి పరిచేలా మార్కెట్ రేటుకే క్రయం జరపాలన్నారు. తాసిల్దార్ ఎంపీడీవో హౌసింగ్ డ్వామా అధికారులు ఉద్యోగులు పూర్తిగా ఇళ్ల లేఅవుట్ల పైననే దృష్టిసారించాలని ఆదేశించారు. స్పందనలో దరఖాస్తు ఇచ్చిన వారిలో ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చిన వారికి ఈ పరిస్థితుల్లోనూ ఇళ్ల స్థలం మంజూరు చేయాలన్నారు. ఇప్పటివరకు సమిష్టి కృషితో 90 శాతం పనులు పూర్తయ్యాయని మరో 20 రోజుల్లో మిగిలిన 10 శాతం పూర్తి చేసి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలబెట్టాలని పిలుపునిచ్చారు. గతంలో ఇందిరమ్మ ఇళ్లు కార్యక్రమం రూపకర్తలలో ఒకరైన శామ్యూల్ మనకి సలహాదారుగా ఉండడం అదృష్టమన్నారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్‌లు ఎల్ శివ శంకర్ నర్సీపట్నం, పాడేరు డివిజన్లలోని మండలాలను, ఎం వేణుగోపాలరెడ్డి విశాఖపట్నం అనకాపల్లి డివిజన్‌లోని మండలాలు కొనసాగుతున్న పేదలందరికీ ఇల్లు కార్యక్రమంపై క్షుణ్ణంగా సమీక్షించారు. మండలాల వారీగా ఎన్ని ఇళ్లు అవసరము ఎంత స్థలం సేకరించారు ఎంత స్థలం కొన్నారు అనే అంశాలపై సమీక్షించారు. ఏమైనా సాంకేతికపరమైన ఇబ్బందులు ఉన్నట్లయితే వాటిని వెంటనే తమ దృష్టికి తేవాలని తాసిల్దార్ ఎంపీడీవోలను ఆదేశించారు. మున్సిపాలిటీలలో రెవిన్యూ యంత్రాంగం, మునిసిపల్ కమిషనర్లతో సమన్వయంతో పని చేయాలన్నారు ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్లు ఎల్. శివ శంకర్, ఎం. వేణుగోపాల్ రెడ్డి, జీవీఎంసీ కమిషనర్ జి. సృజన, సబ్ కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జిల్లా పరిషత్ సీఈవో నాగార్జునసాగర్, డ్వామా పీడీ సందీప్, గృహ నిర్మాణ శాఖ పి డి జయ రామాచారి, ఆర్డీవోలు పెంచల కిషోర్, సీతారామారావు, లక్ష్మీ శివ జ్యోతి, అన్ని మండలాల తహసీల్దార్లు, ఉపాధి హామీ అధికారులు, హౌసింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సీఎం కప్ పేరుతో క్రీడలు నిర్వహిస్తాం

కింద మొదటి బహుమతి రూ. 5 లక్షలు, రెండవ బహుమతి రూ. 2 లక్షలు, మూడవ బహుమతి రూ. 1 లక్ష క్రీడకారులకు అందచేస్తామని మంత్రి అవంతి శ్రీనివాస్ తెలిపారు.

# పౌరసత్వ చట్టాలపై మరో స్వాతంత్ర్య పోరాటమే

## - రాజ్యాంగ వ్యతిరేక చట్టాలలను రద్దు చెయ్యాలి - సీఏఏ, ఎన్.పీ.ఆర్, ఎన్నార్సీలకు జేఏసీ నిరసన




అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరంలో భారత పౌరసత్వ చట్ట సవరణ (సీఏఏ - సిటిజన్ ఎమెండ్మెంట్ ఏక్ట్), భారత జనాభా నమోదు (ఎన్.పీ.ఆర్.లలో నేషనల్ పాపులేషన్ రిజిష్టర్), భారత పౌరుల జాబితా (ఎన్.ఆర్.సి - నేషనల్ రిజిష్టర్ ఆఫ్ సిటిజన్) లను రద్దు చేసేంత వరకు పోరాడాలని సీపిఎం.నేత సత్తిరాజు, శెట్టిబత్తుల కుమారరాజా,జేఏసీ. సమన్వయకర్త అబ్దుల్ సత్తార్, న్యాయవాదులు ఆకాశపు మల్లేశ్వర్రావు, పలివెల నాగేంద్రకుమార్, ఎస్.ఎఫ్.ఐ. నేత గంగాసూరిబాబు పిలుపు నిచ్చారు.సీఏఏ, ఎన్పీఏ, ఎన్.ఆర్.సీలను వ్యతిరేకిస్తూ భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి - ప్రత్తిపాడు నియోజకవర్గ సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లా శంఖవరం మండలం అన్నవరంలో నిరసన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై సభను నిర్వహించారు. ఈ సభలో ఈ ప్రజాస్వామ్య ప్రియులు, అభ్యుదయ వాదులైన వీరు మాట్లాడుతూ ఈ చట్టాలు రాజ్యాంగంలోని 14,15,19 అధికరణాలపై దాడిగా వారంతా అభివర్ణించారు.

ఈ చట్టాలు రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విఘాతం కలిగిస్తాయనీ, అందువల్ల వీటిని వెంటనే రద్దు చేయకపోతే ప్రజా పోరాట ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వారు పిలుపు నిచ్చారు. ఈ చీకటి చట్టాలను, భారత దేశ రాజ్యాంగంపై దాడిని కేంద్ర ప్రభుత్వం ఆపకపోతే మరో స్వాతంత్ర్య పోరాటానికి ప్రజలు సిద్ధంగా ఉండాలని వారు పిలుపు నిచ్చారు. ఇంకా పలు అంశాలపై వీరు సుధీర్ఘంగా మాట్లాడారు. దీనికి ముందు తొలుతగా జన ప్రదర్శన (ర్యాలీ) స్థానిక మసీదు సెంటర్ నుంచి ప్రాంభం అవ్వగా మార్గం మధ్యలో బహుజన ఉద్దారక వైతాళికుడు జోతీరావ్ పూలే, భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న బాబా సాహెబ్ బీఆర్.అంబేద్కర్, బాబూ జగజ్జీవన్ రావు విగ్రహాలకు పూల మాలలను వేసి ఘనంగా నివాళులను అర్పించారు. అనంతరం గ్రామ నడి వీధుల మీదుగా పలు నినాదాలు. ఫ్ల కార్డుల ప్రదర్శనతో శ్రీసత్యదేవుని ఆలయం ముందు నుంచి ర్యాలీ దారి పొడవునా నినాదాలు చేస్తూ స్థానిక పోలీస్ స్టేషన్ సెంటర్ కు చేరుకుంది. ఈ కార్యక్రమంలో నియోజక వర్గంలోని ప్రజాస్వామ్య ప్రియులు, లౌకిక వాదులు, భారత రాజ్యాంగ ప్రియులు, విధ్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు, వాపపక్ష అభ్యుదయ వాదులు,సంఘాలు,నేతలు, ప్రజలు పార్టీలు,మతాలు, భాష, ప్రాంతాలకు అతీతంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గం జేఏసి నాయకులు షేక్ సత్తారు,ఇండుగబల్లి.నూకరాజు, సరమర్ల.మధుబాబు, ఆకాశపు.మల్లేశ్వరరావు, పలివెల.నాగేంద్ర మరియు గ్రామ ప్రముఖులు శెట్టిబత్తుల.కుమార్ రాజా,రాజాల. చిట్టిబాబు, రాయి.శ్రీనివాస్,పలివెల.సతీష్, ఎస్ఎఫ్ఐ,సిఐటియు నాయకులు గంగా.సూరిబాబు,సత్తిరాజు,జక్కల.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాంభట్ల శతజయంతి

విశాఖ సిటీః ప్రముఖ అభ్యుదయోద్యమ నాయకుడు, కవి, పండితుడు, విమర్శకుడు, అంతకు మించిన కమ్యూనిస్టు రాంభట్ల కృష్ణ మూర్తి గొప్పగా చదువుకోపోయిన మంచి విషయ పరిజ్ఞానం కలిగిన వ్యక్తి అని ఆర్ వి రామారావు అన్నారు. శనివారం ఉదయం విశాఖ ద్వారాకానగర్ పౌర గ్రంధాలయంలో అరసం మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం జనసహకార సమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రాంభట్ల శత జయంతి కార్యక్రమంలో ఆర్ వి ఆర్ మాట్లాడుతూ రాంభట్ల 5వ తరగతి 3 సార్లు చదివిన వ్యక్తి అని ఎప్పుడు పూర్తిగా పాఠశాలకు సరిగా వెళ్లి చడవలేదని అందువలన చాలా కాలానికి పూర్తి చేసిన వాడని అటువంటి రాంభట్ల తెలుగు భాషపై మంచి పట్టువున్న గొప్ప కవిగా పాత్రికేయులుగా విమర్శకునిగా అభ్యుయోద్యమ వాదిగా పేరొందారని పేర్కొన్నారు. రాంభట్ల చాలా పుస్తకాలు చదవడం చాలావరకు రాయడం అలవాటు పడిన వారని అచ్చు అయిన ఎ పుస్తకాలు ఆయన వద్ద కనీసం ఒక్క పుస్తకం కూడా ఉంచుకొనే వారు కాదని గొప్ప జ్ఞాపకాలను తన మెదడులో నిర్లిప్తంగా ఉంచుకోవడం ఆయనస్వంత మని కొనియాడుతూ ఆయన శత జయంతి కార్యక్రమం మొట్ట మొదటిసారిగా విశాఖపట్నం లో నిర్వహించడం సంతోషం వ్యక్తం చేస్తూ శత జయంతి సందర్భంగా ఆయన రచనలు తిరిగి ముద్రణ చెయ్యడానికి ఎంతటి కష్టమైన




పనైనా చేస్తామని ప్రకటించారు. అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించగా అరసం ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ విశాఖ అధ్యక్షుడు ఆచార్య చందు సుబ్బారావు అభ్యుదయ సినీ కవి నాటక రచయిత అదృష్ట దీపక్ అరసం విశాఖ ఉపాధ్యక్షురాలు ఆచార్య అయ్యగారి సీతారత్నం మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం విశాఖపట్నం నిర్వాహకులు సీపీఐ రాష్ట్ర సమితి సహాయ కార్యదర్శి కామ్రేడ్ జె వి సత్యనారాయణ మూర్తి ప్రముఖ పాత్రికేయులు మంగు రాజగోపాల్ తదితరులు మాట్లాడారు. పూర్వ శాసన సభ్యులు మానం ఆంజనేయులు ఉప్పల అప్పలరాజు పి ఆనంతరావు విరియాల గౌతమ్ బి వి అప్పారావు డి ఎ రావు మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం ప్రతినిధులు బి వెంకటరమణ ఎం పైడిరాజు విమల పరమేశ్వరి బేగం పలువురు సాహితీవేత్తలు కవులు అభ్యుదయ వాదులు పాల్గొన్నారు.

# విశాఖజిల్లాలో ఆసుపత్రుల అభివృద్ధికి రూ.120 కోట్లు విడుదల

- నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి రూ.8.5 కోట్లు మంజూరు చేసిన ఎమ్మెల్యే గణేష్
- టెండర్ల ప్రక్రియ ముగియగానే మాతాశిశు సంరక్షణ కేంద్ర నిర్మాణానికి సన్నాహాలు
- వైయస్సార్ ఫేజ్ 3 కంటి వెలుగుకై 30లక్షల విలువైన పరికరాలు ప్రారంభించిన ఎమ్మెల్యే



- యంత్రాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్



- కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం : నవరత్నాల్లో భాగంగా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి రూ.8.5కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని, టెండర్లు ఖరారు కావాల్సి ఉందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. శనివారం వైయస్సార్ కంటి వెలుగు ఫేజ్ 3లో భాగంగా రూ.30లక్షల విలువైన పరికరాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖజిల్లాకు ఆసుపత్రుల అభివృద్ధి నూతన విభాగాలు మంజూరుకై రూ.120 కోట్లు విడుదలైందని ఏపివివిపి జిల్లా కోఆర్డినేటర్ నాయక్ వెల్లడించారు. నర్సీపట్నంలో మాతా శిశు సంరక్షణ కేంద్రం నిర్మించాలనే ప్రతిపాదన ఉందని సూపరిండెంటెంట్ డాక్టర్ నీలవేణి అన్నారు. ఆగస్టు 2019లోగా వైయస్సార్ ప్రభుత్వంలోనే 150 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ అనుమతులు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు ఆరు లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు జరపగా 47వేల మందికి కళ్లు మళ్లి రెండవ సారి పరీక్ష జరిపి 27వేల మందికి కంటి చూపు సక్రమంగా లేదని గుర్తించారన్నారు. అందులో 2700 మందికి కంటి అద్దాలు, 350 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారని డాక్టర్ నాయక్ విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ డేవిడ్‌వసంతకుమార్, డాక్టర్ కిరణ్మయి, హెడ్ నర్సులు, డ్రగ్ మెయిన్ స్టోర్ సునంద, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# వేడుకగా శ్రీ దుర్గాలమ్మ జాతరోత్సవం



పూర్ణామార్కెట్: శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి వార్షిక జాతరోత్సవం శనివారం వైభవోపేతంగా జరిగింది. మహాశివరాత్రి పర్వదినం అర్ధరాత్రి 12 గంటలకు శ్రీ అమ్మవారి నేత్రోత్సవం, తొలిపూజను వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.శిరీష, ఇతర భక్తులు ఈ పూజలో పాల్గొన్నారు. శనివారం తెల్లవారుజామునుండి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున బారులుదీరారు. ఉదయం 3 గంటల నుండి దర్శనాలకు అనుమతి ఇచ్చారు. భక్తులు ఘటాలతో వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భవానీ మాతలు జాతరోత్సవంలో అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. మరోవైపు కుంకుమార్చనలు, శూలాల పండగ, భక్తులు అగ్నిగుండం త్రొక్కే కార్యక్రమం వేడుకగా జరిగింది. పూర్ణామార్కెట్, కళ్లు పాకలు, ప్రసాద్‌గార్డెన్స్, పండా వీధి, లక్ష్మీనగర్ ప్రాంతాలు భక్తులతో నిండిపోయాయి. శనివారం సాయంత్రం శ్రీ అమ్మవారి జాతర అత్యంత వైభవంగా జరిగింది. ఈ జాతరలో అమ్మవారి భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. పార్లమెంట్ సభ్యులు ఎం.వి.వి.సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారంతో అమ్మవారి వార్షికోత్సవాలు ముగిశాయని ఈనెల 29న మారువారం పండగను, మార్చి 1న మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.శిరీష తెలిపారు. ఆలయ సిబ్బంది, స్థానికుల సహకారంతో ఈ ఏడాది శ్రీ దుర్గాలమ్మ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించామని, ఈ ఉత్సవాలు విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. అమ్మవారి జాతర సందర్భంగా పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు.

# విష్ణు సహస్ర నామంతో విశ్వశాంతి

- ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్



విశాఖపట్నం : శ్రీ విష్ణు సహస్రనామ సంకీర్తన సత్సంగము (నేవల్ డాక్‌యార్డు) వారి ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్‌లో ఇన్‌కంట్యాక్స్ కార్యాలయం దరి గల ఉప కార్యాలయ ప్రాంగణంలో లోక కళ్యాణార్థము విశ్వశాంతిని ఆకాంక్షిస్తూ మంగళధ్వని వేదమంత్ర పఠనంతో జ్యోతిని వెలిగించి అశేష భక్తజన సందోహం మధ్య "నక్షత్ర మాల" పేరిట 27 సార్లు సామూహికంగా శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించడమైనది.

ఎస్. అప్పలనాయుడు పార్వతి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులందరు సామూహికంగా శ్రీ విష్ణు సహస్ర నామాలను పఠించగా వేదపఠనంలా కొనసాగింది. తదుపరి పి.ఎస్.వి. శ్రీనివాస్ సారథ్యంలో ఆధ్యాత్మిక సభ జరిగింది. ఈ సభలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ పాల్గొని శ్రీ విష్ణు సహస్ర నామం యొక్క ప్రాముఖ్యతను తెలిపారు. వీరితోపాటు కలగ మురళీకృష్ణ, నారాయణరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం అతిథులను సంస్థ తరపున అప్పలనాయుడు దంపతులు ఘనంగా సత్కరించారు. అఖండ శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ జపయజ్ఞంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదములు అన్న ప్రసాదము అందజేయడమైనది.

ఈ కార్యక్రమంలో అప్పలనాయుడు దంపతులు, పి.ఎస్.వి.శ్రీనివాస్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, ఎం.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమా చైతన్యకు గీతం పిహెచ్‌డి అవార్డు



సాగర్‌నగర్: స్థానిక బాబా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో సహాయి ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధనలు జరిపినందుకు గాను పతేం ఉమా చైతన్యకు పిహెచ్‌డి అవార్డును విశ్వవిద్యాలయం ప్రకటించింది. వాహనాలలో ఐసి ఇంజన్ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ఇంజన్ బరువును తగ్గించడానికి తాను ఈ పరిశోధన జరిపినట్లు ఉమా చైతన్య తెలిపారు. తన అధ్యయనం ద్వారా అందిన ఫలితాలతో వివిధ టంగ్‌స్టన్ కార్బైడ్, క్రోమ్ కార్బైడ్, నికెల్ క్రోమ్ సమ్మిళాలన్ని వాడటం ద్వారా వాహనాల ఐసి ఇంజన్ బరువు 30 శాతం మేర తగ్గడంతో పాటు, 10 శాతం సమార్థ్యం పెంచగలిగినట్లు అమె వెల్లడించారు. గీతం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ వి.శ్రీనివాస్ పర్యవేక్షణలో తన పరిశోధన జరిపినట్లు డాక్టర్ పతేం ఉమా చైతన్య వెల్లడించారు.

# 24 నుంచి జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ మీట్



ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆంధ్రవిశ్వ విద్యాలయం హ్యూమన్ రిసోర్స్‌మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యలో ఈ నెల 24,25తేదీలలో జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ మీట్ (జినియో ఫీస్టా) ను నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ ఆచార్య కె.జాన్ తెలిపారు.

కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్‌ను వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి ఆవిష్కరించారు. విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టే విధంగా ఇటువంటి సదస్సులు నిలుస్తాయన్నారు.

సదస్సు కన్వీనర్ ఆచార్య కె.జాన్ మాట్లాడుతూ సదస్సులో భాగంగా విద్యార్థులకు క్విజ్, డిబేట్, యాడ్ మేకింగ్, కేస్ స్టడీ, పేపర్ ప్రజెటేషన్, రోల్ ప్లే వంటి మేధో పోటీలు, నృత్యం,

సంగీతం, సంగీత వాద్య ప్రావీణ్యం, ఫోటోగ్రఫీ, మైమ్ వంటి కళారంగ సంబంధ పోటీలు, క్రీడా విభాగంలో పబ్‌జి, ట్రెజర్ హంట్, ఫేస్ పెయింటింగ్, మిస్టర్ హెచ్‌ఆర్, మిస్ హెచ్‌ఆర్ పోటీలు ఉంటాయన్నారు.

# శ్రీ చైతన్య విద్యాసంస్థకు రెండు ప్రపంచ రికార్డులు



విశాఖపట్నం: ఫిట్ ఇండియా మూమెంట్‌లో భాగంగా దేశవ్యాప్తంగా ఏకకాలంలో స్పోర్ట్ డ్రిల్, యోగాసనాలు వేసిన శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు రెండు ప్రపంచ రికార్డులను సాధించారు.

గత ఏడాది డిసెంబర్ 4న దేశంలోని ఏడు రాష్ట్రాలలో 377 శ్రీ చైతన్య పాఠశాలలకు చెందిన ఒకటి నుంచి ఐదో తరగతి చదువుతున్న 1,21,869 మంది విద్యార్థులు ఏడు నిమిషాల పాటు స్పోర్ట్స్ డ్రిల్‌ను ప్రదర్శించి ప్రపంచ రికార్డు సృష్టించారు. అలాగే 371 శ్రీచైతన్య పాఠశాలలకు చెందిన మూడు నుంచి ఐదో తరగతి చదివే 75,306 మంది విద్యార్థులు పదిహేను నిమిషాల పాటు యోగాసనాలను ప్రదర్శించి సరికొత్త ప్రపంచ రికార్డును సృష్టించారు.

ఎలైట్ వరల్డ్ రికార్డ్స్, ఏషియన్ రికార్డ్స్ అకాడమీ, ఇండియన్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు ప్రదర్శనను పరిశీలించి ప్రపంచ రికార్డులుగా నమోదు చేశారు. వీటికి సంబంధించి ధ్రువీకరణ పత్రం ప్రదాన కార్యక్రమాన్ని విజయవాడలోని మారిస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించారు. లెబనాన్, కువైట్, ఈజిప్ట్‌కు చెందిన ఎలైట్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ సీఈఓలు, ఏషియన్ రికార్డ్స్ అకాడమీ కెయిరో సీఈఓ, ఇండియన్ రికార్డ్ అకాడమీ అసోసియేట్ ఎడిటర్ తదితరులు శ్రీచైతన్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ బి.ఎస్.రావుకు రెండు రికార్డులకంబంధించిన ధ్రువపత్రాలు, పతాకాలను అందజేశారు.

ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల తరపున డాక్టర్ బి.ఎస్. రావును ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని తట్టుకోవాలంటే యోగా, ధ్యానం, క్రీడలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. పిల్లల్లో యోగా, క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ శాఖలకు సంబందించిన ఏజీఎమ్‌లు, స్టేట్ అకడమిక్ కో-ఆర్డినేటర్లు, ఆర్ఘాలు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో అన్నసమారాధన ..




కంచరపాలెం : మహాశివరాత్రి పురస్కరించుకొని జీవీఎంసీ 40 వార్డు పరిధి శ్రీ గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం మర్రిపాలెం ప్రధాన రహదారి వద్ద నున్న శ్రీ గౌరీ రామలింగేశ్వర ఆలయం ప్రాంగ ణంలో భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

శ్రీ గౌరీ సేవాసంఘం సభ్యులు మరియు పాలకమండలి సభ్యులు వేద మంత్రాల నడుమ అర్చనలతో విశేష పూజలు అర్చనలు అబిషేకాలు నిర్వహించారు. కార్యక్రములో బిజేపి 40 వార్డు అధ్యక్షుడు కాళ్ళ ఆదిబాబు శ్రీ గౌరీ సేవ సంఘం అధ్యక్షుడు చదరం గోపి నాధ్ , కార్యదర్శి బీమరశెట్టి బుజ్జి, కోశాధికారి కోరిబిల్లి ఈశ్వర రావు, ఉపాధ్యక్షుడు చదరం శ్రీనివాసరావు, గౌరీ రామలింగేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ చదరం వెంకట రాజు, ఆలయ కమిటీ సభ్యుడు సరగడం గంగు నాయుడు ,వేగి సత్యనారా యణ, పెద్ద సంఖ్యలో మరియు భక్తులు మహిళలు పాల్గున్నారు .

# డిఫెన్స్ అకాడమీ గుర్తింపు రద్దుచేయాలి

వైఎస్ఆర్ఎస్‌యు ఆధ్వర్యంలో వినతిపత్రం



విశాఖపట్నం: వైజాగ్ డిఫెన్స్ అకాడమీ, టి.డి.పి. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు చెందిన రెసిడెన్షియల్ కళాశాల, ఇంటర్మీడియట్‌తో పాటు ఆర్మీ, నేవీలో చేరడానికి అవసరమైన శిక్షణ, ఉద్యోగమంటూ విద్యార్థులను నమ్మించి ఆటస్థలం, హార్స్ రైడింగ్, స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలు కల్పిస్తామంటూ లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేసింది. సుమారు రూ॥1,40,000/-లు నుండి రూ॥1,90,000/-లు వసూలు చేస్తూ ఆటస్థలం, హార్స్ రైడింగ్, స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలు సంస్థవారు కల్పించకుండానే ఫీజులు వసూలు చేస్తున్నారు. కనీసం నాణ్యమైన భోజనం వసతి కూడా లేదు. పురుగుల అన్నం పెడుతున్న యాజమాన్యాన్ని ప్రశ్నించాలనుకున్న విద్యార్థులను సెల్లార్‌లో నిర్భంధంగా బంధించడం దారుణం.

తక్షణమే ఈ ఘటనపై విచారణ జరిపి కళాశాల గుర్తింపును రద్దు చేయాలి. విద్యార్థులను బంధించిన కళాశాల యాజమాన్యంపై కఠినంగా శిక్షించాలి. పై సమస్యలపై ఆర్.ఐ.ఓ. గారైన బి. సుజాత గారికి వినతిపత్రం సమర్పించగా విచారణ జరిపి, తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో వై.యస్.ఆర్.సి.పి. విద్యార్థి విభాగం అధ్యక్షులు బి.కాంతారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్.కిరణ్ నాగ్, ఏ.యూ. అధ్యక్షులు: బి.మోహన్‌బాబు, రాష్ట్ర కార్యదర్శులు: ఎమ్.కళ్యాణ్, విద్యార్థి నాయకులు: కె.సాయికృష్ణ, లీలాకృష్ణ, త్రినాధ్, ఆశీష్, వెంకటేష్, అఖిల్, రామచైతన్య, అశోక్, వెంకటేష్, ముఖేష్, విఘ్నేష్, మాధవ రెడ్డి, మరియు అధిక సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అవాస్తవ ప్రకటనలతో ప్రజలను మభ్యపెటొద్దు

విశాఖపట్నం: విశాఖ జిల్లాలో భూసమీకరణ పారదర్శకంగా జరిగిందని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ వినయ్ చంద్ పదే పదే ప్రకటన చేస్తున్నారంటే దానిలో ఉన్న డొల్లతనం ఆర్థమౌతుంది. జిల్లా కలెక్టర్ ఫిబ్రవరి 21న ల్యాండ్‌పూలింగ్‌లో ఇప్పటి వరకు 6,116 ఎకరాలకు గాను, 4,848.88 ఎకరాలకు సమ్మతి తెలియజేశారని ప్రకటించారు. జాయింట్ కలెక్టర్ 3500 ఎకరాలు సమ్మతి తెలియజేశారని 3 రోజుల క్రితం ప్రకటించారు.ఈ ప్రకటనలన్నీ అవాస్తవమని సిపిఎం పార్టీ విశాఖ జిల్లా కమిటీ భావిస్తోంది. జిల్లాలో ల్యాండ్ సమీకరణ పారదర్శకంగా జరగలేదు. లబ్ధిదారులు ఎవరైతే వున్నారో వారందరికీ ముందుగా నోటీసులు ఇవ్వాలి. ఏఒక్క గ్రామంలో కూడా రెవెన్యూ అధికారులు నోటీసులు ఇవ్వలేదు. గ్రామసభలు లబ్ధిదారుల భాగస్వామ్యంతో జరగలేదు. ల్యాండ్ పూలింగ్‌పై లబ్ధిదారులను చైతన్యం చేస్తున్నామని, వాళ్ళు సర్వే నెంబర్లు, భూములు హద్దులు సరి చేస్తున్నామని గ్రామసభల్లో తెలియజేశారు. లబ్ధిదారుల అభిప్రాయాలతో సంబంధంలేకుండా బెదిరించే చర్యలను అధికారులు ఒడిగట్టారు.

# విజయభాను సంపాదకీయం

## ఆర్సెప్ ఒప్పందం

అమెరికా కోరుకుంటున్న ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్సెప్) ఒప్పందం సాకారమై ఉంటే భారత్ ఇప్పటికే చాలా నష్టపోయేది. ఈ ఒప్పందం నుంచి ఎన్డీయే ప్రభుత్వం బయటకు రావాలని గతేడాది నవంబర్‌లో నిర్ణయించటం ముదావహం. పొరుగుదేశాలు ముఖ్యంగా చైనా ప్రాంతీయంగా అనుసరిస్తున్న ఆధిపత్య విధానాలు, టెర్రరిజానికి అండగా నిలుస్తున్న పాక్ చర్యలకు చెక్ పెట్టాలంటే అమెరికా అండతో వ్యూహాత్మక దౌత్యసంబంధాలను బలోపేతం చేసుకోవాలి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పర్యటనకు భారత్ ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేస్తున్నది. ఈ నెల 24, 25 తేదీల్లో దేశంలో ట్రంప్ రెండురోజుల పర్యటించనున్నారు. తొలిరోజు గుజరాత్‌లోని అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి ఇటీవలనే నిర్మించిన ప్రపంచంలోనే అతిపెద్ద మోతెరా స్టేడియం దాకా 22 కి.మీ. రోడ్‌షో నిర్వహిస్తారు. ఈ షోలో దారిపొడవునా అందంగా భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేరీతిలో తీర్చిదిద్దిన వేదికలపై సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చేందుకు దేశం నలుమూలల నుంచీ కళాకారులను రప్పిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ప్రజలతో స్వాగతం పలికేందుకు సన్నాహాలు కొనసాగుతున్నాయి. నమస్తే ట్రంప్' పేరుతో మోతెరా స్టేడియంలో నిర్వహిస్తున్న స్వాగతసభలో మోదీ, ట్రంప్ ప్రసంగిస్తారు. ఇది అమెరికా పర్యటనలో మోదీకి ఏర్పాటుచేసిన హౌడీ మోదీ సభకు ధీటుగా జరిపేందుకు అటు కేంద్రం, ఇటు గుజరాత్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నాయి. రెండో రోజు తాజ్‌మహల్‌ను ట్రంప్ సందర్శిస్తారు. దీనికిగాను ఆగ్రా ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మరోవైపు ఈ పర్యటన నేపథ్యంలో భారత ప్రభుత్వం చేపడుతున్న చర్యలు వివాదాస్పదమవుతున్నాయి. గుజరాత్ లో సబర్మతీ నదీతీరం వెంబడి ఉన్న మురికివాడలు ట్రంప్‌కు కనిపించకుండా అడ్డుగోడలు కట్టడం, ఇదేరీతిలో ఢిల్లీలోనూ యమునా తీర ప్రాంతంలో యాచకులు కనిపించకుండా దూరప్రాంతాలకు తరలించటం విమర్శలకు తావిస్తున్నది. ట్రంప్ పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య కుదిరే దౌత్య, వాణిజ్యపరమైన ఒప్పందాల విషయంలో స్పష్టత లేకున్నా పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. అగ్రరాజ్యాధినేతగా ట్రంప్, అతిపెద్ద ప్రజాస్వామ్యదేశమైన భారత పర్యటన ను కేవలం స్నేహపూర్వక సౌహార్ద సందర్శనగా ఎవరూ పరిగణించకపోవటమే దీనికి కారణం. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్‌కు భారత్ పర్యటన మొదటిదే అయినా, ఈ 8 నెలల కాలంలో వివి ధ సందర్భాల్లో ట్రంప్‌తో మోదీ ఐదు సార్లు భేటీ అయ్యారు. గతేడాది అమెరికా పర్యటన సందర్భంలో కూడా మోదీ పర్యటన నుంచి అమెరికాలోని ప్రవాస భారతీయులు ఎంతో ఆశించారు. ఆ క్రమంలో జరిగిన ప్రచార ఆర్భాటం అంతా ఇంతా కాదు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక ఆయన వలసలు, హెచ్1బీ వీసాల విషయంలో అనుసరించిన కఠిన విధానాలతో భారత సంతతి విద్యార్థులు తీవ్ర భయాందోళనలకు గురయ్యా రు. సరిగ్గా ఆ సందర్భంలోనే మోదీ అమెరికాలో పర్యటించారు. భారతీయుల భయాలు దూరంచేసే దిశలో విధాన నిర్ణయాలు ట్రంప్ నుంచి వెలువడుతాయని ఆశించారు. కానీ అలాంటిదేమీ లేకుండానే మోదీ ప్రచార పటాటోపంతోనే ముగిసింది. ప్రస్తుత ట్రంప్ భారత్ పర్యటన ప్రచారానికే పరిమితమైనదని అనుకోవటానికి లేదు. గత కొన్నేండ్లుగా అమెరికా భారత్ నుంచి విస్తృతస్థాయి స్వేచ్ఛా వాణిజ్యానికి తహతహలాడుతున్నది. ఇందులో వ్యవసాయరంగ ఎగుమతులు, డెయిరీ తదితర రంగాల్లో స్వేచ్ఛా వాణిజ్యానికి, ఎగుమతులకు అవకాశం ఉండాలని అమెరికా ఆశిస్తున్నది. దీనికి సంబంధించి విస్తృతస్థాయి ఒప్పందాలు ఇప్పటికిప్పుడు కుదరకపోయినా, మౌలికంగా ప్రాథమికస్థాయి ఒప్పందాలతోనైనా తిరిగివెళ్లాలని ట్రంప్ పర్యటనలో ఉన్న ఆలోచనలని అర్థమవుతున్నది. అమెరికాతో దౌత్యపరమైన సంబంధాల్లోనే గాక, వాణిజ్య ఒప్పందాల్లో భారత్‌కు కీలక భాగస్వామ్యం ఉన్నది. రక్షణ, సహకార ఒప్పందాల్లో ఇరుదేశాలు భాగస్వాములై ఉన్నాయి. అమెరికా నుంచి భారత్ రక్షణరంగంలో మూడు బిలియన్ డాలర్ల విలువైన కొనుగోళ్లు చేస్తున్నది. అమెరికా లో ట్రంప్ అవలంబిస్తున్న ఆత్మరక్షణ విధానాల నేపథ్యంలో భారత్ వ్యాపారరంగంలో అనేక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నది. టారిఫ్‌ల పెంపు, కొన్నిరకాల అల్యూమినియం లోహ ఉత్పత్తుల ఎగుమతులపై ఆంక్షలు విధించటంతో భారత్ తీవ్రంగా నష్టపోయింది. ప్రస్తుతం అమెరికా ఆశిస్తున్నట్లు వ్యవసాయం, డెయిరీ రంగాల్లో బహుళజాతి సంస్థల్ని అనుమతించాలన్నది అమెరికా ఆకాంక్ష. ఇదే జరిగితే ఈ రెండురంగాలకు శరాఘాతమే. దేశంలోని చిన్నస్థాయి డైయిరీ రైతులు, స్థానిక సహకార సంఘాలు, చిన్నస్థాయి అమ్మకందారులు సుమారుగా 15 కోట్ల మంది తీవ్రంగా నష్టపోతారు. గ్రామీణ ప్రాంతంలోని చిన్న తరహా డెయిరీల వార్షిక ఉత్పత్తి విలువ పది వేల కోట్ల డాలర్లు.

## నిర్భయ దోషులకు తిహార్ జైలు అధికారుల చివరి లేఖ



న్యూఢిల్లీ : నిర్భయ కేసులో నలుగురు దోషులకు తిహార్ జైలు అధికారులు చివరిసారిగా లేఖ రాశారు. నలుగురు దోషులు పవన్ గుప్తా, వినయ్ కుమార్ శర్మ, అక్షయ్ కుమార్, ముఖేష్ కుమార్ సింగ్‌లు చివరిసారిగా తమ కుటుంబసభ్యులను కలిసేందుకు అనుమతిస్తామని తిహార్ జైలు అధికారులు రాసిన లేఖలో పేర్కొన్నారు. నిర్భయ దోషుల్లో ముఖేష్, పవన్ లు మాత్రం తాము ఫిబ్రవరి 1వ తేదీన డెత్ వారంట్ జారీకి ముందే తాము తమ కుటుంబసభ్యులను కలిశామని జైలు అధికారులకు తెలిపారు. అక్షయ్, వినయ్ లు మాత్రం తాము తమ కుటుంబసభ్యులను కలుస్తామని జైలు అధికారులకు చెప్పారు.

సాధారణంగా దోషులకు కిటికీ ద్వారానే కలిసేందుకు అవకాశమిచ్చేవారు. కాని ఉరిశిక్షకు ముందు చివరిసారి కలిసే ములాఖత్ లో దోషులు కుటుంబ సభ్యులను నేరుగా కలిసి మాట్లాడేందుకు అనుమతించ నున్నారు. బస్సులోనే నిర్భయపై సామూహిక అత్యాచారం చేసి, హతమార్చిన దారుణ కేసులో దోషులైన పవన్ గుప్తా, వినయ్ కుమార్ శర్మ, అక్షయ్ కుమార్, ముఖేష్ కుమార్ సింగ్‌లకు ఉరిశిక్ష అమలు తేదీలను పాటియాలా ట్రయల్ కోర్టు మార్చి 3న ఉదయం 6 గంటలకు ఖరారు చేసింది. దీంతో వీరిని తిహార్ జైల్లో ఉరి తీయనున్నారు. నలుగురు దోషులను ఉరి తీసేందుకు వీలుగా తలారీని రెండు రోజుల ముందే తమ జైలుకు పంపించాలని తిహార్ జైలు అధికారులు తాజాగా యూపీ జైళ్ల శాఖ అధికారులకు లేఖ రాశారు. వినయ్ తన తలను గోడకు కొట్టుకున్న దృష్ట్యా జైలు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

## అచ్చెన్నాయుడిని చూసి జగన్ భయపడుతున్నారు : బండారు సత్యనారాయణ

విశాఖపట్నం : బీసీలంటే ప్రభుత్వానికి చిన్నచూపని టీడీపీ నేత బండారు సత్యనారాయణ దుయ్యబట్టారు. ఎమ్మెల్యే అచ్చెన్నాయుడిని చూసి సీఎం జగన్ భయపడుతున్నారని ఎద్దేవాచేశారు. అందుకే ఆయనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ ఒక వర్గానికే కొమ్ముకాసేలా వ్యవహరిస్తున్నారని, ఉత్తరాంధ్రలో బీసీలు ఎదగకూడదా అని ప్రశ్నించారు. దమ్ముంటే విజిలెన్స్ రిపోర్ట్‌ని బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. మీరు వేసిన సిట్‌లో మంత్రులే ఉన్నారని విమర్శించారు. పారిశ్రామిక వేత్త నిమ్మగడ్డ ప్రసాద్, జగన్ బాగోతం బయటపడుతుందో అని... భయంతో మోదీ కాళ్లు పట్టుకున్నారని బండారు



సత్యనారాయణ ధ్వజమెత్తారు.

## నాపై ఈప్రభుత్వానికి ఎంతో కక్ష ఉంది : చంద్రబాబు



అమరావతి: తనపై, టీడీపీపై ఈప్రభుత్వానికి ఎంతో కక్ష ఉందని టీడీపీ అధినేత చంద్రబాబు ఆరోపించారు. ప్రభుత్వం నిన్న వేసిన సిట్ దానికి మరో ఉదాహరణ అని చెప్పారు. 9 నెలల్లో మూడు సిట్‌లు, 5 కమిటీలు వేశారని, 8 నెలల క్రితమే కేబినెట్ సబ్ కమిటీ వేశారన్నారు. రాష్ట్రాభివృద్ధికి అడ్డుపడటం, పెట్టుబడులు తరిమేయడం తప్ప ఏం సాధించారని ప్రశ్నించారు. జీవో 344 వైసీపీ ప్రభుత్వ వేధింపులకు పరాకాష్ఠ అని మండిపడ్డారు. మీ పాలనపై వచ్చే ప్రభుత్వం సిట్ వేస్తుందని, వీటితో ప్రజలకు ఒరిగేది ఏంటని నిలదీశారు. టీడీపీ ఏనాడూ తప్పు చేయలేదని, వైసీపీ బెదిరింపులకు భయపడమని చంద్రబాబు స్పష్టం చేశారు.

## *బెదిరింపులకు మేం భయపడం: గల్లా జయదేవ్*

అమరావతి: వైసీపీ ఎంపీల బెదిరింపులకు తాము భయపడమని ఎంపీ గల్లా జయదేవ్ అన్నారు. 3 రాజధానుల నిర్ణయాన్ని ఎవరూ సమర్థించడం లేదని, మూడు రాజధానులు అంటే పాలన చేయడం కష్టమన్నారు.

మందడం రైతులకు జయదేవ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా నాలుగేళ్లపాటు ఉద్యమం కొనసాగించాల్సి రావొచ్చని, తనకు రాజధానిలో ఒక సెంట్ స్థలం కూడా లేదని గల్లా జయదేవ్ తెలిపారు.

## ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం. (ఫిబ్రవరి 23)

భారత ఇంద్రజాల విద్యను ప్రపంచం నలుమూలలకు తీసుకెళ్ళి అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన చరిత్ర పురుషుడు జాదు చక్రవర్తి పి సి సర్కార్. వీరి పుట్టిన రోజునే అంతర్జాతీయ ఇంద్రజాలికుల దినోత్సవం గా నిర్వహిస్తారు. ఈయన పూర్తిపేరు ప్రాతుల్ చంద్ర సర్కార్. 1913 ఫిబ్రవరి 23 న నేటికీ బంగ్లాదేశ్ లో ఉన్న తంగైల్ లో జన్మించారు. వీరిది ఇంద్రజాలికుల కుటుంబం. బాలునిగా ఇంద్రజాలం పట్ల ఉన్న మోజు వీరిని 1933 నాటికి సంపూర్ణ ఇంద్రజాలికునిగా తీర్చిదిద్దింది. మాయలు, మంత్రాలు లేకుండా కేవలం హస్తలాఘవం చేత తక్కువ వ్యవధిలో అద్భుత ట్రిక్కులను కళ్ళకు కట్టినట్లు చూపేవి మ్యాజిక్. భారత ఇంద్రజాలానికి దేశ సంస్కృతిని మేళవించి అంతర్జాతీయంగా ఆసక్తిని కలిగించారు. దేశ విదేశాల్లో మహారాజా ఆహార్యంతో దర్శనమిచ్చి ఆకట్టుకునే వారు. ప్రదర్శనలు ఇస్తూనే సుమారు 22 గ్రంధాలు రచించారు. వాటిలో మేజిక్ చరిత్ర, హిప్నాటిజం, మీరు చేయదగిన 100 మేజిక్ లు మొదలైనవి. ఇంగ్లీష్, బెంగాలీ, హిందీ భాషల్లో మరికొన్ని రచనలు చేశారు. భారతీయ సంస్కృతిలో భాగమైన ఇంద్రజాలానికి అధునూతన శాస్త్ర జ్ఞానాన్ని రంగరించి ప్రేక్షకులను మైమరిపించే కళ సర్కార్ ది. వాటిలో రోప్ ట్రిక్, ఫ్లైయింగ్ కార్పెట్, ఎక్స్ రే కళ్ళు, స్పుత్నిక్ రాకెట్, ఫెస్టివల్ ఆఫ్ కోల్ కతా, మహిళను రంపంతో కోయడం వంటి ట్రిక్కులు ప్రేక్షకుల్ని దిగ్భ్రాంతికి గురి చేస్తూ తమ కళ్ళను తామే నమ్మలేనట్టు ఉండేవి. 1964 లో వీరిని పద్మశ్రీ తో గౌరవించిన కేంద్ర ప్రభుత్వం విదేశాలలో సాంస్కృతిక రాయబారిగా నియమించింది.

'నిద్రలో ఇంద్రజాలాన్ని శ్వాసిస్తాను, మేల్కున్నప్పుడు ఇంద్రజాలం చేస్తుంటాను' అని పేర్కొనే పి సి సర్కార్ ఆ మాటల్ని నిజం చేస్తూ 1971జనవరి 6 న తన 58 వ ఏట జపాన్ లో ఇంద్రజాలాన్ని ప్రదర్శిస్తూ గుండెపోటుతో కన్నుమూశారు.

ప్రపంచ ఇంద్రజాలిక దినోత్సవం సందర్భంగా ఆధ్యాత్మిక పేరున చేసే ఇంద్రజాలాన్ని గుర్తించి మోసపోకుండా భారతీయులు తమను తాము కాపాడుకోవాలి. సాంకేతికతపై ఆధారపడిన నిజమైన ఇంద్రజాలికులను ప్రోత్సహిద్దాం...! గౌరవిద్దాం...!

## సమకవియం

### కర్తవ్య పాలన

కర్తవ్యోన్ముఖులను గావించునది
ఋణమార్గంలో నడిపిస్తూ
గమ్యానికి చేర్చునది
అరిషడ్వర్గాలను లోబరుచుకొని
కోరికల గుర్రాలకు పగ్గాలు వేసి
శాంతి, అహింస, కరుణ, ప్రేమ
దైవిక గుణాలను అలవర్చునది
భక్తి కరదీపిక భగవద్గీత
ఇష్టదేవతా సాక్షాత్కార మొనరించునది
భక్తి, జ్ఞాన,యోగ మార్గములలో
జీవితానికి దివ్యత్వం ఒసంగునది
స్వస్వరూప సాక్షాత్కారం ప్రసాదించునది
సకల మానవాళికి కర్తవ్య పాలన దిశగా
నడిపించు దివ్య, పవిత్ర గ్రంథం భగవద్గీత

...కవితా రచన
సి.ప్రతాప్

## పంచాంగం

అమావాస్య రా.7.50; ధనిష్ఠ ప.12.57; రా.వ.8.48ల 10.33.

ఆదివారం 23-02-2020

**మేషం** : శాస్త్ర రంగాల వారికి పరిశోధనలు, ప్రయోగాలకు మంచి గుర్తింపు లభిస్తుంది. మీ వాహనం, విలువైన వస్తువులు జాగ్రత్త. గృహ నిర్మాణాలు, మరమ్మతులకు అనుకూలం.మీ ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. భాగస్వామిక చర్చలు, సంప్రదింపులకు అనుకూలం. స్త్రీలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. **వృషభం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కాన వస్తుంది. **మిథునం** :ఎల్ఐసి, పోస్టల్ ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు టార్గెట్‌లను అధిగమిస్తారు. ఉపాధ్యాయులకు, రిప్రజెంటేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు ఆరోగ్యంలో అధికమైన జాగ్రత్త అవసరం. **కర్కాటకం** : స్థిరాస్తుల అమ్మకానికై చేయు యత్నాలు వాయిదా పడతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో అప్రమత్తత అవసరం. విద్యార్థులకు మిత్రబృందాలు, వ్యాపకాలు అధికం కాగలవు. దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కార మవుతాయి. అంతగా పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండటం మంచిది. **సింహం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. **కన్య** : ధనసహాయం చేసే విషయంలో అప్రమత్తత అవసరం. దైవదర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులు ఓర్పు, నేర్పుతో విజయాన్ని సాధించగలరు. మధ్యవర్తిత్వం వహించటం వల్ల మాటపడక తప్పదు. మార్కెటింగ్ రంగాల్లో ఒత్తిడి పెరుగుతుంది. పాత వస్తువుల వల్ల ఇబ్బందులు తలెత్తుతాయి. **తుల** : నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిలదొక్కుకుంటారు. జీవితభాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సామాన్యం. ప్రముఖుల కలయిక వల్ల ఆశించిన ఫలితం ఉంటుంది. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు, బిల్డర్లకు స్వీయ పర్యవేక్షణ ముఖ్యం. **వృశ్చికం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. కొంత మంది మీ నుంచి ధనం లేక ఇతర్రతా సహాయం అర్థిస్తారు. ముఖ్యుల రాకపోకలు అధికం అవుతాయి. **ధనుస్సు** : వృత్తి వ్యాపారులకు అన్నివిధాలా అను కూలం. కీలకమైన సమస్యలు పరిష్కారం కావటంతో మీలో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. కుటుంబీకుల కోరికలు తీరుస్తారు. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. భాగస్వామిక చర్చల్లో మీ అభిప్రాయాలకు ఆమోదం లభిస్తుంది. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. **మకరం** : ఒక కార్యం నిమిత్తం ప్రయాణం చేస్తారు. పత్రికా సంస్థలలోని వారికి ఊహించని సమస్యలెదురవుతాయి. దంపతుల మధ్య చిన్న చిన్న కలహాలు, చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. డాక్టర్లు అరుదైన చికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. సభలు, సమావేశాల్లో చురుకుగా పాల్గొంటారు. **కుంభం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. **మీనం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతు లకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కాన వస్తుంది.

## బాల్య వివాహాలు అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు -మంత్రి విశ్వరూప్



అమలాపురం : గ్రామాలలో బాల్యవివాహాలు అరికట్టుటలో సంబంధిత శాఖ అధికారులతో పాటు గ్రామవాలంటీర్లు మహిళా సంరణ కార్యదర్శులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తెలిపారు. శనివారము అమలాపురం, అల్లవరం మండలాలకు సంబందించి అమలాపురం, బి.ఆర్.అంబేద్కర్ కమ్యూనిటీహాలులో సమగ్ర శిశు అభివృద్ధి పథక అధికారిణి ఐ.విమల అధ్యక తన యేర్పాటు చేసిన ప్రాజెక్ట్ పరిధిలో గ్రామ వాలంటీర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులకు కిశోరీ వికాసం పై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమములో మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భముగా మంత్రి మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన పై బాల్యవివాహాల ద్వారా సంభవించే అనర్దాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. అలాగే బాలికల అక్రమ రవాణాపై పోలీసులు ప్రతేక నిఘా పెట్టి సంభందిత వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. వాలంటీర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు కూడా దీనిపై ప్రత్యేక నిఘాపెట్టి తక్షణమే పోలీసులకు పై అధికారుల దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు. ప్రభుత్వము వసతి గృహ, పాఠశాలలో విద్యార్థినీ విద్యార్దులకు రాష్ట్ర ప్రభుత్వము పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందిస్తుందని మంత్రి తెలిపారు. వసతిగృహాలు, గ్రామాలలో రక్తహీనత ఉన్న బాలికలను గుర్తించి రక్తహీనత నివారణకు దగ్గరలోని ఆరోగ్య కేంద్రాలకు తీసుకువెళ్ళి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వము అన్ని కుటుంబాల వారిని అనేక సంక్షేమ పథకాలతో అదుకుంటుందని ఈ పరిస్థితులలో పిల్లలను పనులకు కాకుండా పాఠశాలలకు పంపాలని, ఎక్కడైనా బాలకార్మికులు ఉన్నట్లయితే వారిని గుర్తించి వాలంటీర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, పోలీసు అధికారులకు దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచిస్తూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషిచేయాలని మంత్రి సూచించారు. ఈ కార్యములలో అమలాపురం,అల్లవరం స్టేషన్ హౌస్ అధికారులు కె.సుగుణశ్రీ కుమారి, అమలాపురం తాహసిల్దార్ మాధవరావు, అల్ల వరం తాహసీల్దార్ అప్పారావు జిల్లా బాలల పరిరక్షణ అధికారి సి.హెచ్.వెంకట్రావు, అడ్వకేటు దైవ దీవెన,వై.యస్.ప్రసాద్,పి.హెచ్.సి. పేరూరు డాక్టరు ఎం.శాంతి లక్ష్మి,గోడిలంక పి.హెచ్.సి డాక్టరు ,టి.కె.శ్రీనివాస్, ఎం.ఇ.ఓ.అల్లవరం కె.కిరణ్ బాబు, అమలాపురం హెడ్ మాష్టర్ కామేశ్వరరావులు పాల్గొన్నారు.

## ఇళ్ళ స్థలాలు కేటాయించాంటూ పాత్రికేయుల వినతి



అమలాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఉగాది కానుకగా పేదలందరికీ ఇళ్ళస్థలాలు పంపిణీ చేస్తున్న సందర్భంగా అమలాపురం పాత్రికేయులు ఇళ్ళ స్థలాలు కేటాయించాలని కామనగరులోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖా మంత్రి పినిపే విశ్వరూప్‌ను కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ సమాజంలో సమస్యల సాధనకు నిరంతరం కృషి చేయడంలో పాత్రికేయులు పాత్ర ఎంతైనా ఉందన్నారు. పట్టణంలోని విలేకర్లందరికీ స్థలాలు మంజూరు అయ్యేవిధంగా తాను కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే అమలాపురం ఆర్డీఓ బిహెచ్ భవానీ శంకర్, తహశీల్దార్ కెవి మాధవరావులకు పాత్రికేయులు ఇళ్ళ స్థలాలు కేటాయించాలని వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు కొండేపూడి సత్యనారాయణ, అబ్బాస్, ఎస్.హరిబాబు, జివిఆర్. మూర్తి, ఎండి బషీర్, పివి వెంకటేశ్వరరావు, చొల్లంగి సత్యప్రసాద్, కడలి సాయిబాబా, ఎం విష్ణు, చిరంజీవి, కుడుపూడి సుబ్బారావు, ఆర్‌ఐ తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, DASARI SHARADHA (Old name) W/o.DASARI MAHESWARA RAO, R/o.D. No-2-57, Pedda veedhi, Krishna Palle, Parvathipuram mandal, Vizianagaram-Dist. Changing my name from DASARI SHARADHA (Old name) to DASARI SARADA (NEW NAME), henceforth I am being called as DASARI SARADA (NEW NAME) for all purposes

**CHANGE OF NAME**

We parents, Smt MOHAMMAD SAJIDA PARVEEN W/o. MOHAMMAD MUNEER BEG, R/o 6-42-1/3, Janatha colony, Padmanabhapuram, Gopalapatnam, Visakhapatnam-530027. Are changing our daughter name from "FATIMA" (Old Name) to SANA FATIMA (New name). Hence fourth our daughter will be called as SANA FATIMA for all purposes


# విప్రో డ్రైవ్‌కు ఎంపికైన అశ్వని



నర్సీపట్నం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి కార్పొరేషన్ సంస్థ వారి ఆధ్వర్యంలో విశాఖపట్నం గాయత్రి విద్యా పరిషత్‌లో ఈ నెల 17న నిర్వహించిన విప్రో డ్రైవ్‌లో నర్సీపట్నం ఏబిఎం డిగ్రీ కళాశాల థర్డ్ బిఎస్సీ చదువుతున్న వీసం అశ్వని ట్రైనీగా ఎంపికైంది. ఆ విద్యార్థి ఉన్నత విద్యకు అయ్యే ఖర్చు విప్రో కంపెనీ భరిస్తుంది. ఈ విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్ ఎ.గిరిబాబు, ఏరియా స్కిల్ ఆఫసర్ కె.శ్రీనివాస్ అభినందించారు.

## 'స్ఫూర్తి' స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో

# ఉచిత హోమియో వైద్య శిబిరం

విశాఖపట్నం : ఇప్పటకి గడిచిన 12 సం॥ములు నుండి 'స్ఫూర్తి' స్వచ్ఛంధ సేవాసంస్థ అందిస్తున్న ఉచిత వైద్య సేవలలో భాగంగా ఈనెల ఆఖరు ఆదివారం(నేడు) ఉదయం 9.30 గం॥ల నుండి మధ్యాహ్నం 1 గంట వరకూ ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించెదరు. పెందుర్తి దగ్గరున్న 'సరిపల్లి' గ్రామంలో గల 'శ్రీ సాయి బాలాజీనగర్ లే అవుట్' గల 'స్ఫూర్తి సేవా సదన్' భవనంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడును. ప్రముఖ వైద్యులు డా.బి.వి.భాస్కర్ (బిహెచ్ఎంఎస్) కెజిహెచ్ దగ్గరున్న చందన హోమియో క్లినిక్ నుండి వచ్చి పరీక్షలను నిర్వహించెదరు. డాక్టర్ సలహా మేరకు అందరికి ఉచితంగా మందులు 'స్ఫూర్తి' సేవా సంస్థవారు ఇచ్చెదరు. కావున ఈ సదవకాశమును అందరూ ఉపయోగించుకోవలసినదిగా కార్యనిర్వాహక ధర్మకర్త నీలి జగదీష్ తెలిపారు.

# నేడు రెడ్డివారి గుండాలమ్మ తీర్థం



పరవాడ: నేడు మండల కేంద్రమైన పరవాడలో గుండాలమ్మ తీర్థమహోత్సవాన్ని అంగరంవైభవంగా నిర్వహిస్తున్నట్లుకమిటి ప్రతినిదిలు శనివారము ఒక ప్రకటనలో తెలిపారు. దీంట్లోభాగంగా మద్యహ్నం అలయం వద్ద బారీ అన్న సమారాధన్ను ఏర్పాటు చేస్తామని, చుట్టుప్రక్కల గ్రామ ప్రజలు అందరూ ఈఅన్నసమారాదనలో పాల్గోనీ ప్రసాదాన్ని స్వీకరించాలనీ కమిటి ప్రతినిదిలు కోరారు.

## గురుకుల కళాశాలలో

# విద్యార్థులకు వీడ్కోలు సభ



కొయ్యూరు : కాకర పాడు గురుకుల కళాశాల ఆవరణలో సెకండ్ ఇయర్ విద్యార్థులకు, ఫాస్ట్ యియర్ విద్యార్థుల వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా వైఎస్ఆర్ సీపీ నాయకులు బడుగు రమేష్, కొయ్యూరు ఎస్ఐ దాసరి నాగేంద్ర హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ కళాశాల ప్రిన్సిపల్ స్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ, విద్యార్థులు కష్ట పడి చదివి ,మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. . ఉన్నత శిఖరాలు చేరు కోవలన్నారు. విద్యార్థులకు అట్టలు, పెన్ లు అందజేశారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. కొయ్యూరు ఎస్ ఐ. దాసరి నాగేంద్ర కు దుశ్శాలువ కప్పి సన్మానించారు . అనంతరం ఉపాధ్యాయులందరికీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలు స్కూళ్ళ సిబ్బంది పాల్గొన్నారు.

## మౌలానా అబుల్ కలామ్ ఆజాద్

# 63వ వర్ధంతి




అమలాపురం : పట్టణం 13వ వార్డులో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 63వ వర్థంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. జనసేన పార్టీ పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ మహబూబ్ షరీఫ్ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ పురపాలక సంఘం ప్రాథమిక ఉర్దూ పాఠశాలలో శనివారం నిర్వహించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు పెన్నులు,పెన్సిల్ లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మొయినుద్దీన్ జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు పిండి వెంకటసత్య సాయిబాబా,పట్టణ ఉపాధ్యక్షులు ముత్యాల మణి, జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఏడిద శ్రీను,ఆర్.డి.స్. ప్రసాద్,నల్లా అజయ్,కల్వకొలను ఉమా,షేక్ ఫిరోజ్,తక్షేమ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అప్పికొండ సోమేశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కింపు



పరవాడ: అప్పికొండ శ్రీశ్రీశ్రీ సోమేశ్వరా ఆలయంలో హుండీ మరియు టికెట్స్ లెక్కింపు సుమారు 8,62985 రూపాయలు అదాయం వచ్చిందనీ వైసిపి వార్డు అధ్యక్షులు బట్టుసన్యాశిరావు శనివారము తెలిపారు. శిఘ్రదర్శనానికి 1,16400, విశిష్టదర్శనానికీ 2,50,140,పులిహోరాకి 1,13250,లడ్డుకి 106875,హుండి 2,76320 మొత్తము మీద 8,62985రూపాయాలు అదాయం లభించిందనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ పార్టీ యూత్ ప్రెసిడెంట్ కొరివి శివ కుమార్, ఉత్సవకమిటీ సామన్యాయ కమిటీ సభ్యులు కొరివి గంగా రాజు, అర్జుల్లి రమణ, మద్ది అప్పారావు, మద్ది శ్రీను, సతీష్, రెడ్డి, కొండబాబు, దేవుడు, తాతరావు, సోమినాయుడు, మాజీ ఛైర్మెన్ సోడిపెల్లి సోములు, నక్క అప్పారావు. ఇఒ శ్రీనివాస్ రావు, చదువుల నాగరాజు పంతులు, పిట్ట వెంకట్ రెడ్డి, ఆలయ సిబ్బంది, శ్రీవారు సేవకులు, గ్రామ పెద్దలు అందరూ పాల్గొన్నారు.

స్వామివారినీ సుమారు లక్ష మంది భక్తులు దర్శించుకున్నారనీ తెలిపారు.


**IN THE HON'BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, AT : VISAKHAPATNAM**

**I.A. 222/2019 in O.S. 956/2019**

Between:
Galla Polipalli …Petitioner/Plaintiff
And
Vinod Malik and another …Respondents/Defendants

**NOTICE**

To,
**Respondents/Defendants :**

**R-1**: **Vinod Malik,** S/o. Raj Singh Malik, Hindu, aged about 42 years, R/at. D.No.63-3-57, Kantam Residency, FF-1, 4th Floor, Jawahar Nagar, Gullalapalem Village, Gajuwaka, Visakhapatnam

**R-2** : **Smt.Sudesh Malik,** W/o. Vinod Malik, Hindu, aged about 38 years, Rest-do-

Whereas the above named petitioner/plaintiff has instituted the above interlocutory application I.A. & Suit against both of you for recovery of amount on the basis of promissory note & I.A for attachment of your property i.e. site measuring an extent of 426.66 sq. yds or 356.687 sq.mts being Plot No.34 covered by S.No.33/1 of Gullalapalem Village, Jawahar Nagar Area, together with old RCC House thereon bearing D.No.63-3-57 within the limits of Gajuwaka SRO, GVMC Limits and the matter stands posted to **06-03-2020** in the above named Court.

Therefore, you are hereby called upon to appear in the above named Court in person or by a pleader on **06-03-2020 at 10:30 A.M.** to answer the same failing which the matter will be decided in your absence and disposed of exparte.

(By Order of the Hon'ble Court)

**VOONA VIJAYA KUMAR**
Advocate,
Visakhapatnam
**Cell: 9848081238, 6281286594**

**IN THE HON'BLE COURT OF THE JUDGE : FAMILY COURT AT : VISAKHAPATNAM**

**F.C.O.P.578/2019**

**Between :**
**1. Pabolu Srujana Priyadarshini**
**2. Pabolu Sahasra Priya**
**(as 2nd petitioner being minor represented by her natural guardian the 1st petitioner) …Petitioners**
**And**
**Pabolu Vijaya Rama Rao …Respondent**

**NOTICE**

To,
**The Respondent :**
**Sri Pabolu Vijaya Rama Rao,**
S/o. Raja Rao, Hindu, aged 32 years,
Occupation : Software Engineer,
R/at. D.No.26-20-8, HPCL Lane, Opposite More Shop,
Chaitanya Nagar,Visakhapatnam-530026.

Please take notice that the above F.C.O.P.578/2019 filed by the petitioners against the respondent for maintenance under Section 125 Cr.P.C and the matter stands posted to **18-03-2020** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **18-03-2020 at 10:30A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence.

(By Order of the Hon'ble Court)

**Y.V.V.S.N LAW CHAMBERS**
**G. RAVI KUMAR**
Advocate
# 33-12-50, Allipuram,
Visakhapatnam.
**Cell: 9848191525/9293808414**


# ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు బెంచ్ తీర్పును రద్దు చేయాలి



ఎస్.రాయవరం : ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీం బెంచ్ ఇచ్చిన తీర్పును రద్దు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల చర్యలు చేపట్టాలని మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు చారేంద్ర డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విలేకర్లుతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు బెంచ్ తీర్పును రద్దు చేయాలని తక్షణం రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లపై అసెంబ్లీ తీర్మానం చేయాలని కోరారు. సుప్రీంకోర్టు జడ్జిలు చేసిన వాఖ్యలు ఇచ్చిన తీర్పు మనువాద అగ్రకుల పాలకుల వాదాన్ని జడ్జీలు బయటపెట్టారన్నారు. విశాఖపట్నం జిల్లా మాలమహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ జె.సి.రామకృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధ నిబంధనలను వక్రీకరించి ఆర్టికల్ 16(1), 16(14)ఎ లను రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా తీర్పునిచ్చారని మండిపడ్డారు. తీర్పును రద్దు చేయడానికి బీజేపీ మోడీ సర్కార్ పార్ల మెంట్‌లో సవరణ ద్వారా చర్యలు తీసుకో వాలన్నారు. రిజర్వేషన్లను 9వ షెడ్యూల్డ్‌తో పాటు ప్రాథమిక హక్కుల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. దళిత మానవ హక్కుల సాధన కోసం తీవ్రస్థాయిలో పోరాటాలు చేస్తామని మాలమహానాడు నాయకులు మాదాసు చారేంద్ర, ప్రముఖ న్యాయవాది జె.సి.రామ కృష్ణలు తెలిపారు.

# బీజేపీ ఆధ్వర్యంలో ఉచితంగా మంచినీరు పంపిణీ



భీమునిపట్నం : భారతీయ జనతా పార్టీ అర్బన్ అధ్యక్షుడు సత్తరపు వాయునందనరావు ఆధ్వర్యంలో శివరాత్రి సందర్భంగా సముద్ర స్నానాలు చేసే భక్తులకు ఉచితంగా మంచినీరు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి రోజు ఉపవాసం చేసి ఆరాత్రి జాగరణ చేసి మరుసటి రోజు భక్తులు సముద్ర స్నానాలు చేస్తుంటారు. భక్తుల సౌక ర్యార్థం మంచినీటిని సరఫరా చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఉప్పాడ అప్పారావు, వాసుపల్లి శ్రీహరి, బిజెపి మహిళా నాయకురాలు కె.పరిమళ, డి.లీలావతి, డివిజన్ నాయకులు ఎం.రమేష్, కె.రాజారావు, పళ్ళా భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు జగనన్న వసతి దీవెన గొప్ప వరం

## పలకా ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఛైర్మన్ రవి



అనకాపల్లి : ఈనెల 24 నుండి ప్రారంభం కానున్న జగనన్న వసతి దీవెన పేద విద్యార్థులకు వరమని, పలక ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఛైర్మన్ పలక రవి అన్నారు. ఆయన శనివారం స్దానిక విలేకర్లతో మాట్లాడారు. విద్యపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, నాడు - నేడు, అమ్మఒడి, ఫీజు రియాంబర్స్‌మెంట్ వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి 24 నుండి జగనన్న వసతి దివెనకు శ్రీకారం చుట్టడం విద్యార్థులకు శుభపరిణామం అన్నారు. విద్యతోనే ప్రగతి ఉంటుందని, భావించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో 11 లక్షల 87 వేల మంది విద్యార్థులకు 1139 కోట్ల 16 లక్షల రూపాయలు తల్లిదండ్రుల ఖాతాల్లో జమచేయడానికి నిర్ణయించడం అభినందనీయమన్నారు. విశాఖ జిల్లాలో లక్షా ఐదువేల ఏడువందల మంది విద్యార్థులు ప్రయోజనం చేకూరేలా 99 కోట్ల 26 లక్షలు చెల్లించేందుకు అధికారులకు ఆదేశాలు జారీచేయడం విశేషమన్నారు. ఇందులో 6,802 ఐటిఐ విద్యార్థులు కాగా 12,179 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఉన్నారని చెప్పారు. డిగ్రీ నుండి ఆపైన చదివిని 86వేల 7వందల 28 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కేవలం డిగ్రీ నుండి ఆపైన చదివిన వారికే ఇవ్వాలని, గతంలో ప్రకటించిన ఐటిఐ పాలిటెక్నిక్ విద్యార్థులను కూడా పరిగణలోకి తీసుకోవడంతో మరో 20వేల మందికి ప్రయోజనం చేకూరిందన్నారు. ఫీజు రియాంబర్స్ మెంట్‌తో పాటు, విద్యార్థుల వసతి, భోజన ఖర్చుల నిమిత్తం ఏడాదికి 20 వేల చొప్పన రెండు విడతలగా అందించేందుకు చర్యలు చేపట్టడం విద్యకు, ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను తెలియజేస్తుందన్నారు. తల్లిదండ్రులు గుర్తించాలన్నారు అనకాపల్లి ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్ పర్యవేక్షణలో నియోజకవర్గంలో 25 నుండి వాలంటరీలు ఇంటింటికి వచ్చి జగనన్న విద్యావసతి దీవెన కార్డులు అందిస్తారని అందరూ గమనించాలని ఈ సందర్భంగా రవి కోరారు.

## మన బడి నాడు-నేడు

### పాఠశాలలలో రెడ్ క్రాస్ వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి



కాకినాడ : రెడ్ క్రాస్ సొసైటి రాష్ట్ర అధ్యక్షులు మరియు రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరి చందన్ ఆదేశాలు ప్రకారం జిల్లాలో 15 వేల మొక్కలు నాటే కార్యక్రమన్ని చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డి.మురళీధర్ రెడ్డి తెలిపారు.శనివారం నాడు సాలిపేట పైడా సత్తిరాజు మున్సిపల్ కార్పోరేషన్ బాలికల హైస్కూల్ నందు రెడ్ క్రాస్ సంస్థ అధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డి.మురళీధర్ రెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ ఆదేశాలు ప్రకారం జిల్లాలో 15 వేల మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ 15 వేలు మొక్కలకి అదనంగా మరో వెయ్యి మొక్కలు నాటించడం జరుగుతుందన్నారు.అదేవిధంగా జిల్లాలో నాడు- నేడు కార్యక్రమంలో మొదటి దశలో గుర్తించు అన్ని పాఠశాలలో ఈ వన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కలక్టర్ తెలిపారు. నాడు నేడు కార్యక్రమంలో 9 అంశాలతో పాటు 10వ అంశంగా పచ్చధనాన్ని అభివృద్ధి చేసే విధంగా ప్రతి పాఠశాలలో మొక్కలు నాటించడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమానికి సంబంధంచి మొక్కలు, మెటిరియల్ అటవిశాఖ సరఫరా చేస్తున్నారని కలెక్టరు తెలిపారు. గుంటూరు, కడప, నంధ్యాల లో జరగిన రాష్ట్ర స్థాయిలో హాకీ

పోటిలలో ప్రథమస్థానం సాధించిన సాలిపేట హైస్కూల్ విద్యార్థులు మరియు పిఈటి సిహెచ్ఎల్ వి. కుమారి లను కలెక్టర్ డి.మురళీధర్ రెడ్డి ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ఎస్.అబ్రహం, కాకినాడ మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ కె.రమేష్ , జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్‌సంస్థ ఛైర్మన్ వైడి.రామారావు, జిల్లా అటవిశాఖ అధికారి ఆర్.శ్రీనువాసు, ఎఫ్ఆర్ ఎమ్.శివకుమార్, డివైఆర్ఓ ఏ.సూరి బాబు, ఎఫ్ఎస్ఓ ఎమ్.గౌతమ్ పాఠశాల ప్రధానో పాధ్యాయులు జె. సుబ్బలక్ష్మీ,పాఠశాల రెడ్ క్రాస్ నోడల్ ఉపాధ్యాయారాలు పద్మావతి, ఎమ్డీహెచ్. సరోజ, డివి.సుబ్బలక్ష్మి, ఉమాదేవి, రెడ్ క్రాస్ సంస్థ కార్యదర్శి కె.శివకుమార్ పాఠశాల ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


# సందడి కేజిబివిలో వార్షికోత్సవం



గొలుగొండ : గొలుగొండ కేజిబివిలో శనివారం 9వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఇన్‌చార్జ్ ఎంఇఒ టి.అమృతకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి భవిష్యత్‌ను ఎంచుకోవాలని కోరారు. 10వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉత్తమ ఫలితాలు తీసుకు రావాలని కోరారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని, ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా బాలికలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిసిడిఒ చెల్లా రాజేశ్వరి, ఎంఐఎం కోఆర్డినేటర్ ప్రసాద్, ఎస్ఒ భవానీ పాల్గొన్నారు.

# భీమిలి సముద్ర తీరంలో భక్తుల స్నానాలు



భీమునిపట్నం : మహా శివరాత్రి పురస్కరించుకొని భీమిలి లోని భక్తులు భీమిలి సముద్ర తీరంలో స్నానాలు ఆచరించారు. రాత్రంతా శివ నామ స్మరణతో జాగారం చేసిన భక్తులు సాగర సంగమ స్నానాలు ఆచరించడం ద్వారా పాపాలు తొలగి పుణ్యం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో ఇక్కడ స్నానాలు ఆచరించేందుకు భీమిలి తోపాటు పద్మనాభం ఆనందపురం మరియు విజయనగరం ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున పోటెత్తారు. ఇందుకోసం ఎటువంటి ఇబ్బందులు కలగకుండా భక్తులకు సౌకర్యార్థం, ముఖ్యంగా మహిళలు దుస్తులు మార్చుకోవడానికి తాత్కాలిక గదులను ఏర్పాటు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు ప్రసాదాలు, మంచినీటిని భక్తులకు ఉచితంగా అందించాయి. 108 మరియు అగ్నిమాపక వాహనాలను అధికారులు అందుబాటులో ఉంచడం తోపాటు..... ఉచిత వైద్య శిభిరాలు ఏర్పాటు చేశారు. అలాగే పోలీసు వారు తీరంలో బందోబస్తు ఏర్పాటు చేయడం చేసి భక్తులు సముద్రం లోపలికి వెళ్ళకుండా గజ ఈతగాళ్ళను నియమించారు.అనంతరం స్నానాలకు వచ్చిన భక్తులు బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో బీచ్ వద్ద ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం చేసుకుని పునీతులైయ్యారు.

# అంతకాపల్లిలో వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తీర్థ మహోత్సవం

## 2000 మందికి భారీ అన్నసమారాధన



సబ్బవరం : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న సబ్బ వరం మండలం లోని అంతకాపల్లి గ్రామం శివారు లగుడు వారి ఇల్లల దగ్గర స్వయం భూగా వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తీర్థ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది శనివారం ఉదయం 5 గంటల నుండి స్వామివారికి దీప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఆలయం అర్చకులు రవితేజ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఆలయాన్ని బంతి పూలతో అలంకరించారు స్వామిని దర్శించటానికి భక్తులు బారులు తీసారు దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదాలు వాటర్ ప్యాకెట్లు ఉచితంగా పంపిణీ చేశారు అనంతరం2000 మందికి భారీ అన్న ఆరాధన జరిగింది అంగరంగ వైభవంగా తీర్థ మహోత్సవం జరిగింది రాత్రి 7 గంటలకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో సత్య నారాయణ, లగుడు దేవుడు బాబు, నరసయ్య, మహేశ్వరరావు, రమేష్,వనం చల్లారావు, సత్యనారాయణ, వెన్నెల అప్పల నాయుడు, వెన్నెల స్వామి, ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌బుక్‌డే పుస్తకావిష్కరణ



కోటవురట్ల : రెడ్ బుక్ డే పేరిట కమ్యూనిస్టు ప్రణాళిక పుస్తక ఆవిష్కరణ శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం నాయకులు పెంటకోట వెంకటస్వామి, గజ్జెలపు డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ దేశంలో నెలకొన్న నిరుద్యోగ సమస్య, ఆర్థిక సంక్షోభం పెరిగిపోయి దేశంలో ప్రజలు కొనుగోలు శక్తి పడిపోయిందన్నారు. ఇవన్నీ పరిష్కారం కావాలంటే ప్రజలందరూ కార్ల మార్క్స్, ఎంగేల్స్ రాసిన కమ్యూనిస్టు ప్రణాళిక పుస్తకాన్ని చదివి, ఆచరించి ఈ దేశంలో నెలకొన్న నిరుద్యోగ సమస్యను ఆర్థిక సంక్షోభంను తీర్చి ప్రజల కొనుగోలు శక్తిని పెంచడానికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జల్లు రాజు, రాముడు, వర ప్రసాద్, అనిల్‌కుమార్, పొట్ల కిరణ్, పొట్ట ప్రవీణ్ కుమార్, రెల్లి శేఖర్‌బాబు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య విద్యా సంస్థలకు 3 ప్రపంచ రికార్డులు




అమలాపురం : స్థానిక పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో శ్రీ చైతన్య వరల్డ్ రికార్డు ఫెస్టివల్ 2019 పురస్కరించుకుని ఇండియా రికార్డ్స్ అకాడమీ, ఎలైట్ వరల్డ్ రికార్డ్స్, ఏషియన్ రికార్డ్స్ అకాడమీ వారి సమక్షంలో గత డిసెంబర్ 4వ తేదీన దేశంలోని ఏడు రాష్ట్రాల్లో 390 శ్రీ చైతన్య బ్రాంచీల్లో 240 కేంద్రాల్లో ఒకటో తరగతి నుండి ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు 1,42,000 మంది ఏకకాలంలో స్పోర్ట్స్ డ్రిల్, యోగాసనాలు వేసి రికార్డు సృష్టించారు. ఈ రికార్డులను పురస్కరించుకొని విజయవాడలోని మేరిస్ స్టెల్లా ఆడిటోరియం లో లెబనాన్, ఈజిప్ట్, సింగపూర్ మరియు కువైట్ దేశాల రికార్డ్ కమిటీ ప్రతినిధులు రికార్డ్ సర్టిఫికెట్స్‌ని శ్రీ చైతన్య విద్యా సంస్థల అధినేత డాక్టర్ బి ఎస్ రావు, ఏజియం వైఎస్ఎస్, రీజనల్ ఇంచార్జి, ప్రిన్సిపాల్‌లకు అందించారని శ్రీ చైతన్య పాఠశాలల ప్రాంతీయ అధికారి పి. శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అమలాపురం బ్రాంచ్ తరపున పాఠశాలల రీజియనల్ ఇంచార్జి పి. శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ వసు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు జి. గోపి, కె.సతీష్ ఈ ప్రపంచ రికార్డుల ధృవీకరణ జ్ఞాపికలను వివిధ దేశాల ప్రతినిధుల చేతుల మీదుగా స్వీకరించారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో ఏజీఎం వైఎన్ఎస్ మాట్లా డుతూ మాట్లాడుతూ ఇంతటి విజయానికి కృషి చేసిన పాఠశాల ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ వసు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు గోపి, సతీష్‌లను ఆయన అభినందించారు.

# నేడు కాండ్రేగుల కుటింబీకుల వనసమారాధన



అనకాపల్లి : జిల్లాలో ఉన్న కాండ్రేగుల, కాళ్ల కుటుంబీకుల ఆత్మీయ వనసమారాధన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కాండ్రేగులు శ్రీరాం, కాండ్రేగుల నాయుడు తెలియజేస్తూ ఒక ప్రకటన విడుదల చేసారు. ఆదివారం జాతీయ రహదారిపై ఉన్న నూకాంబిక ఆర్చ్ సమీపంలో ఉన్న కర్రి వారి వీధి వద్ద ఈ సమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ డాక్టర్ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులతో పాటు కాండ్రేగుల కుటుంబాలకు చెందిన పాలొంగాటాని చెప్పారు. తీ సందర్భంగా మిమిక్రి, కూచిపూడి నృత్యప్రదర్శన పిల్లలకు ఆహ్లాదకరంగా ఉండే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింధన్నారు. వివరాలకు 9290485355 నెంబర్లో సంప్రదించాలని, కాండ్రేగుల కాళ్ల కుటుంబీకులకు చెందిన వారు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగ్గారావు, సురేష్, చందు, వాసు, హరికృష్ణ, విష్ను తదితరులు పాల్గొన్నారు.

## ఒకేషనల్ విద్యార్థులకు
# ఇండస్ట్రియల్ పరిశీలన

అమలాపురం : సమనస గ్రామంలో గల ఎంజెపిఎపి బిసి గురుకుల పాఠశాల విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులో భాగంగా స్థానిక ప్రసిద్ధ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎలక్ట్రిక్ మోటార్, ఎలక్ట్రానిక్ పరికరాలను మరియు అన్ని ఇంజనీరింగ్ బ్రాంచిల యంత్రాలను పరిశీలించి వాటి పనితీరును నిపుణులైన కాలేజీ అధ్యాపకుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైటియస్ రాజు మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఇందులో భాగంగానే ఈ ఇండస్ట్రియల్ టూర్ ఏర్పాటు చేశామని తద్వారా విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సుల పట్ల అవగాహన కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ట్రయినర్ నల్లా లక్ష్మీ నాగ దేవి, పి. త్రినాథ్ రెడ్డి, సూదా మాచర జానకేశ్వేరరావు, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఈఎస్ఐ కుంభకోణంలో
# దోషులను కఠినంగా శిక్షించాలి



అనకాపల్లి : ఈఎస్ఐ ఆసుపత్రిలో మందుల కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి దోషలను కఠినంగా శిక్షించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోన. లక్ష్మణ డిమాండ్ చేశారు ఈ మేరకు శవివారం అమన ఒక్క ప్రకటన విడుదల చేశారు తెలంగాణ తరహాలో ఆంధ్ర ప్రదేశ్ లోను గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం హయంలో గుట్టుచప్పుడు గా కాకుండా కొనసాగిన ఈ కుంభకోణం కేసులో డైరెక్టర్లతో పాటు నాటి కార్మిక శాఖ మంత్రి కిచ్చారపు. అచ్చెన్నాయుడు హస్యమున్నట్లు విజిలెన్స్ అధికారులు దర్యాప్తులో తెలిసిందని వివరించారు. కార్మికులు కు వైద్య. ఆరోగ్య సౌకర్యాలు కల్పించకుండా అన్యాయం చేసి కోట్లాది రూపా యలు దోచుకుంటున్నారని విమర్శించారు రాష్ట్రంలో అనేక ఈ ఎస్ ఐ ఆసుపత్రులు మూతపడటంతో పాటు నిధులు దోచుకోవడం తో డ్రాక్టర్లు నియామకాలు. పరికరాల కొరత ఏర్పడిందని పేర్కొన్నారు. దీని ఫలితంగా ఈఎస్ఐ సభ్యులు గా ఉన్న కార్మిక కుటుంబాలు ఇబ్బందులకు గురయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు అన్ని విషయాలు పై సమగ్ర దర్యాప్తు చేపట్టి దోషలను ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని కోన.లక్ష్మణ డిమాండ్ చేశారు.

# పెట్రోలియం, ఎనర్జీ, సహజ వాయువు రంగాలలో పరిశోధన అవకాశాలు



విశాఖపట్నం : దేశ భవిష్యత్తు పైన ఎనర్జీ, పెట్రోలియం మరియు సహజ వాయువు రంగాలు గొప్ప ప్రభావం చూపటం కొనసాగిస్తున్నాయి. కనుక, ఈ రంగాలు ఎదుర్కొంటున్న సాంకేతిక పరమైన ఆవిష్కరణలు, ఎకనామిక్ మరియు ఆర్థిక పరమైన సవాళ్ళు విస్మరించలేదు. ఇందుకు సంబంధించి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం మరియు ఎనర్జీ విశాఖపట్నం వారు పెట్రోలియం, ఎనర్జీ మరియు సహజ వాయువు రంగాలలో పరిశోధన అవకాశాలు (రీఓపెన్-2020) అనే అంశం పైన స్థానిక హోటల్ గ్రీన్ పార్కు-విశాఖపట్నం వద్ద ఈనెల (ఫిబ్రవరి-2020) 24 నుంచి 27 వ తేదీ వరకు నాలుగు రోజులు కార్యశాల (వర్క్ షాప్) నిర్వహిస్తుంది. పెట్రోలియం, పునరుత్పాదక ఎనర్జీ మరియు సహజ వాయువు ప్రక్రియకు సంబంధించి అధునాతన పరిశోధన అవకాశాలు మరియు సవాళ్లు గురిన్చి చర్చించుటకు దేశ మరియు విదేశీయ నిపుణులును ఒక వేదిక పైకి చేర్చటం ఈ కార్యశాల పాధమిక ఉద్దేశ్యం. శక్తి (ఎనర్జీ) సామర్థ్యతను మెరుగుపరచటం, కర్బన వుద్గారాలు తగ్గించటం మరియు అమలు పరచుటకు పునరుత్పాదకతకు దగ్గరగా తీసుకు వెళ్ళటం వంటి సాంకేతికత పైన ప్రదాననగా దృష్టి సారించటం. ఎనర్జీ, మరియు పెట్రోలియం రంగాలలో ప్రస్తుత మరియు భవిష్యత్ అంశాలు, పెట్రోలియం మరియు ఎనర్జీ ఇంజనీరింగ్, శక్తి మార్పిడి మరియు సౌర శక్తి , ఎనర్జీ స్టోరేజ్ మొదలైన రంగాలలో పరిశోధన మరియు విద్యా అవకాశాలు వగైరా గురించి ఈ కార్యశాల నందు చర్చిస్తారు.

రీఓపెన్ ఆవిష్కరణ సదస్సు 24 ఫిబ్రవరి 2020న మధ్యాహ్నం ఆయిల్ పరిశ్రమ సభ్యులు మరియు విద్యావేత్తలు సమక్షంలో ప్రారంభమవుతుంది. పరిశ్రమ మరియు పరిశోధన ప్రయోగశాలలు ఇండియా లిమిటెడ్, ENTEK ఎన్విరాన్మెంటల్ వంటి ప్రముఖ నిపుణులు పాల్గొని ప్రస్తుత మరియు భవిష్యత్ పరిశ్రమ అంశాల నైపున్యతలు పంచుకుంటారు. టెక్సాస్ యూనివర్శిటీ ఆఫ్ లూయిస్ విల్లె, రోవాన్ యూనివర్శిటీ, క్రాన్ ఫీల్డ్ యూనివర్శిటీ, IIT-డిల్లీ, NIT-త్రిచి, సదరన్ యూనివర్శిటీ AM కాలేజి,మొదలైన వాటినుండి జాతీయ మరియు అంతర్జాతీయ విద్యావేత్తలు హాజరై పెట్రోలియం సహజ వాయువు రంగాలలోని పరిశోధనలు మరియు అవకాశాలు పైన తమ దృక్పధం వివరిస్తారు. బ్రోచర్ ఆవిష్క రణలో పాల్గొన్న సభ్యులు: రమణన్,నియోగీ, ప్రసాద్ డైరెక్టర్, డా.దీ.శ్రీధర్ రెడ్డి, రిజిస్ట్రార్, డా.అరుణ్ కుమార్ పూజారి, ఫ్యాకల్టీ.

# కాట్రేనికోన మండలంలో భారీగా ప్లాస్టిక్ వినియోగం

## - నష్టపోతున్న పర్యావరణం - బార్లుగా మారుతున్న రైతుల పొలాలు

కాట్రెనికొన(తూ గొ జిల్లా) : కాట్రెనికొన మండలంలో భారీగా ప్లాస్టిక్ వినియోగం ఎక్కువ అయ్యింది. దీంతో పర్యావరణం నష్టపోవడమే కాక రైతుల పొలాలు బారులుగా మారుతున్నాయి. ప్రతీషాపులోనూ ప్లాస్టిక్ కవర్లు లభ్యమవుతున్నాయి.ఇంతకుముందు కవర్స్‌అంటే షాపుల్లో ఇచ్చేవారుకాదు. ఇప్పుడు ప్రతీఒక్కరూ కవర్లను వినియోగిస్తున్నారు. పసివాడుత్రాగే పాలపేకట్స్‌నుండి పెద్దవారు త్రాగే మందు,వాటర్‌పేకట్స్‌వరకూ ప్లాస్టిక్ కవర్స్ లభ్యమవుతున్నాయి. కవర్స్ లేనిదే వ్యాపారమే జరగదు. అలాగే కవర్స్‌లేనిదే వస్తువులను వినియోగించేనాధుడే ఉండడు అన్న స్థితికి ప్లాస్టిక్ కవర్స్ చేరుకున్నాయి.ఒక్క ప్లాస్టిక్ కవర్స్‌కాదు.ప్లాస్టిక్ గ్లాసులు, టీగ్లాసులుమరియు ప్లాస్టిక్ చెంచాలు వంటి సామాగ్రీలు ప్లాస్టిక్ రూంలో లభ్యమవుతున్నాయి. దీంతో ప్లాస్టిక్ వినియోగం మరింత అధికమవుతోంది. ఎక్కువగా మందుబాబులు ఈప్లాస్టిక్ ను అధికంగా వినియోగిస్తున్నారు.ఎందుకంటే వీరికి మద్యంసీసాలనూ,ప్లాస్టిక్ వాటర్ పేకట్స్‌నూ మోయడానికి తప్పనిసరిగా ప్లాస్టిక్ కవర్స్‌ను ఉపయోగించి వీరి అవసరం అయినతరువాత అన్యాయంగా రైతుల పొలాల్లో విసిరిపారేస్తారు. ఎందుకంటె మందుబాబులు సాయంత్రం సమయంఅయ్యేసరికి ఒక స్థావరంఎంచుకుని ఆస్థావరంలో మద్యం సిటింగ్ ఏర్పాటుచేసుకుని తప్పత్రాగి చిందులేసి ఉపయోగించిన ప్లాస్టిక్ కవర్స్ పంటపొలాల్లో మరియు రహదారుల ప్రక్కలో పారవేస్తారు. పారవేసిన ప్లాస్టిక్ కవర్స్ ఎంతకాలమైనా రోడ్డుప్రక్కనే దర్శనమిస్తాయి అలాగే మద్యంసీసాలూ వీళ్ళుత్రాగిన ప్లాస్టిక్ సీసాలు గ్లాసులు కూడా కనిపిస్తూ ప్రజలనూ ఇబ్బందులకు గురిచేయడమేకాకుండా తీవ్రమైన పర్యావరణ నష్టానికి గురిచేస్తున్నారు.ఎవరైనా సామాన్యుడు చదువుకున్న విద్యావంతులూ ప్రశ్నిస్తే మందుబాబులు చెప్పే సమాదానం ఒక్కటే మేం ఎవరిమో తెలుసా అని. దీంతో ప్రశ్నించే నాధుడులేక ప్లాస్టిక్ వినియోగం మరింత అధికమౌతుందీ పర్యావరణం నాశనం అవుతోంది.పర్యావరణం కు నష్టం వాటిల్లితే ఓజోన్ పొర దెబ్బతింటుంది అంతేకాక ఓజోన్ పొర దెబ్బతింటే సూర్యకిరణాలు నేరుగా ప్రజలపై పడటమే కాకుండా అనేక నష్టాలు జరుగుతాయి.ఈ విషయమై ప్రభుత్వాలు స్పందించి ప్రజలకు అవగాహన కల్పించి పర్యావరణాన్ని రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# 24న జగనన్న విద్యాదీవెన కార్డులు పంపిణీ

## నర్సీపట్నం ఏఎస్‌డబ్ల్యూఒ సత్యనారాయణ వెల్లడి



మాట్లాడుతున్న ఏఎస్‌డబ్ల్యూఒ సత్యనారాయణ

నర్సీపట్నం : ఈ నెల 24న జగనన్న విద్యాదీవెన వసతి దీవెన కార్డులు నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు నర్సీపట్నం ఏఎస్‌డబ్ల్యూఒ టి. సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో నాలుగు మండలాల గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గంలో 5957 విద్యాదీవెనకు అర్హులన్నారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఎం.నర్సింహులు, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ బిహెచ్‌వి.రమణబాబు, నాలుగు మండలాల గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# తాణాంలో శివునికి రుద్రాభిషేకము



పరవాడ : పరవాడ మండలము తాణాం గ్రామంలో శ్రీ మతి కన్నూరు దేవివెంకటమణ ఎమ్ పిటిసి ఆధ్వర్యంలో మహాశివరాత్రి పూజలో రుద్ర అభిషేకము,హెూమం, సహస్ర లింగార్చన అంగరంఘవైభవంగా నిర్వహించారు. కన్నూరు దేవి,వెంకటమణ చేతులుమీదగా ప్రత్యేకపూజలు జరిగాయి. ఈకార్యక్రమంలో భక్తులు ,తాణాం గ్రామం ప్రజలు మరియు కన్నూరు యువసేన సభ్యులు తథితర్లు పాల్గొన్నారు.

# మార్కెటింగ్ డైరెక్టర్‌గా జల్లి సత్యవతి



అమలాపురం: అల్లవరం మండలం మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్‌గా బోడసకుర్రు మాజీ ఉప సర్పంచ్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జల్లి రాధా కృష్ణ సతీమణి జల్లి సత్యవతిని నూతనంగా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పేదలకు పెద్దపీట వేస్తుందనడానికి నిదర్శనమన్నారు. జగన్ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తానని ఆమె అన్నారు. అలాగే తన భర్త రాధాకృష్ణ వైసిపి పార్టీలో చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం తనపై నమ్మకంతో ఈ పదవిని అందించారన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌కు , రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖా మంత్రి పినిపే విశ్వరూప్, ఛైర్మన్ బొక్కా ఆదినారాయణ, గ్రామస్థులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## జెఎన్‌టియులో సింపోజియం టెక్‌ఫెస్ట్




కాకినాడ: జెఎన్‌టియుకె ప్రాంగణంలో శనివారం ఉదయం ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, (ఈసిఈ) మరియు కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్ (సిఎస్ఈ) విభాగాలు సంయుక్తాధ్వర్యంలో జాతీయస్థాయి సింపోజియం టెక్‌ఫెస్ట్‌ను నిర్వహించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ టెక్‌ఫెస్ట్‌లో ఈసిఈ ఫెస్ట్‌ను ఎస్పార్క్స్-20, సిఎస్ఇ ఫెస్ట్‌ను జైగెస్ట్-20గా వ్యవహరించారు. ప్రారంభోత్సవ కార్యక్రమం ది.22.02.2020న శనివారం ఉదయం 10గంటలకు అలూమ్ని ఆడిటోరియం నందు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రెక్టార్ ప్రొ.జి.వి.ఆర్.ప్రసాదరాజు విచ్చేయగా విశిష్ట అతిథిగా ఓఎస్‌డి ప్రొ.వి.రవీంద్రనాధ్, గౌరవ అతిథులుగా యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.బి.బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.ఎం.హెచ్.ఎం.కృష్ణప్రసాద్ విచ్చేశారు. ఈసిఈ విభాగాధిపతి డా.బి.టి.కృష్ణ, సిఎస్ఈ విభాగాధిపతి డా.డి.హరిత మరియు ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు డా.బి.లీలాకుమారి, డా.ఎన్.రామకృష్ణయ్యలు వేదికనలంకరించారు. జ్యోతిప్రజ్వలన అనంతరం రెండు విభాగాల సావనీర్లను అతిథులు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో రెక్టార్ ప్రొ.జి.వి.ఆర్.ప్రసాదరాజు మాట్లాడుతూ టెక్‌ఫెస్ట్‌ల ద్వారా విద్యార్థులు సాంకేతిక విజ్ఞానాన్ని మెరుగుపర్చుకుని సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలన్నారు. విద్యార్థులు జాతీయస్థాయి సింపోజియంలలో పాల్గొని జ్ఞానసముపార్జన చేసినట్లయితే ఉన్నతస్థాయికి ఎదగవచ్చునని తద్వారా వారు చదువుకున్న కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చినవారవుతారన్నారు. ఓఎస్‌డి ప్రొ.వి.రవీంద్రనాధ్ మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి జాతీయస్థాయి సాంకేతిక సింపోజియంలలో పాల్గొని తమ వినూత్నమైన ఆలోచనలను ఇతరులతో పంచుకుని వాటిని ఆవిష్కరణలుగా తీర్చిదిద్దాలన్నారు. టెక్‌ఫెస్ట్‌ల ద్వారా నేర్చుకున్న ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని నూతన ఆవిష్కరణలు చేపట్టి కళాశాల పేరును ఇనుమడింపజేయాలన్నారు. యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.బి.బాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు టెక్ ఫెస్ట్‌ల ద్వారా నేర్చుకున్న ఆధునిక సాంకేతికతను తమ తోటి స్నేహితులకు కూడా అందించాలన్నారు. సానుకూల దృక్పథంతో విద్యార్థులు ముందుకు సాగి తమ కలలను సాకారం చేసుకోవాలని కోరారు. ఫెస్ట్‌లు నూతన సాంకేతిక విషయ పరిజ్ఞానం పెంపొందించేలా రూపకల్పన చేయాలని విద్యార్థులకు సూచించారు. యుసిఇకె వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.ఎం.హెచ్.ఎం.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ టెక్‌ఫెస్ట్‌కు హాజరైన విద్యార్థులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ డా.బి.లీలాకుమారి కార్యక్రమానికి వందన సమర్పణ గావించారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అడ్మిషన్స్ ప్రొ.కె.వి.రమణ, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు శ్రీమతి ఏ.కరుణ, శ్రీమతి కె.ఝాన్సీరాణి, అధ్యాపకులు, స్టూడెంట్ కో-ఆర్డినేటర్లు, యుసిఇకె మరియు అనుబంధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలలో శ్రీ శారదా విద్యార్థుల ప్రతిభ




అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరం స్థానిక శ్రీ శారదా విద్యాలయం విద్యార్థులకు శనివారం విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ ల్యాబ్స్ వారి ఆద్వర్యంలో రాష్ట్ర స్థాయి అబాకస్ మరియు వేదిక్ మ్యాథ్స్ పోటీలు విజయవాడ నందు జరిగాయి.ఈ పోటీలలో పాల్గొన్న శ్రీ శారదా విద్యాలయం విద్యార్థులు జి.హారిక(2వ తరగతి),ఎం.లాస్య(3వ తరగతి),పి.గంగా వీరేంద్ర(5వ తరగతి) ద్వితీయ మరియు కన్సోలేషన్ బహుమతులు సాధించినట్లు శ్రీ శారదా విద్యాలయం కరస్పాండెంట్ కృష్ణ వర్మ తెలిపారు.ఈ సందర్భంగా కృష్ణ వర్మ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరములుగా మా విద్యాలయం నందు అబాకస్ నేర్పుతున్నామని దీని వలన పిల్లల విశ్లేషణ నైపుణ్యాలు ఎంతో మెరుగు పడతాయని తెలిపారు.అదేవిధంగా పిల్లలు రాష్ట్ర స్థాయిలో స్కూలు పేరును నిలబెట్టడం మాకు ఎంతో గర్వముగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బోనగిరి.శ్రీనివాస్,పిఇటి.సూరిబాబు,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సత్యదేవుని ప్రాకార సేవ



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి వాసుడైన శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివార్కి శనివారం ప్రాకారసేవ ఘనంగా జరిగింది. ఉదయం 10 గంటలకు శ్రీ స్వామి,అమ్మవార్లను ప్రాధాన రాజగోపురం వద్దకు తోడ్కొని వచ్చి సర్వాంగ సుందరంగా తిర్చి దిద్దిన వెండి తిరుచ్చిపై ఆశినులు గావించి భక్తుల గోవింద నామస్మరణాలు,మేళ,తాళాలు సడుమ శ్రీ స్వామి,అమ్మవార్లను ముమ్మారు ప్రాధాన రాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు.ఈ కార్యక్రమంలో ఏఈవో ప్రసాద్,సూపరింటెండెంట్ లక్ష్మణస్వామి,టెంపుల్ ఇన్ స్పెక్టర్ పోల్నాటి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన ఇళ్ళస్థలాలను సిద్ధం చేయాలి

### ఇన్-ఛార్జి కలెక్టర్ కె.శ్రీనివాసులు



శ్రీకాకుళం:ఇళ్ళ స్థలాలను త్వరిత గతిన సిద్ధం చేయాలని ఇన్-ఛార్జి కలెక్టర్ కె.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిరుపేదలకు ఇళ్ళ స్థలాల పంపిణీ కార్యక్రమంపై తహశీల్దారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఉగాది నాటికి ఇళ్ళ స్థలాల పంపిణీ అనే బృహత్తర కార్యకమానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఇందు నిమిత్తం, ఇళ్ళ స్థలాల సేకరణ, లెవెలింగ్, లే-ఔట్లను త్వరితగతిన పూర్తి చేయడం వంటి కార్యక్రమాలపై శ్రద్ధ వహించాలని తెలిపారు. 126 స్థలాలను పూర్తి స్థాయిలో అందచేయటం జరిగిందన్నారు. సర్వే రాళ్ళకు నెంబర్లను వేయాలన్నారు. 20 మండలాలలో సర్వే రాళ్ళను సమకూర్చారని, 25 శాతం సర్వే రాళ్ళు సిద్ధమయ్యాయని చెప్పారు. అన్ని మండలాలలోను సర్వే రాళ్ళను సమకూర్చుకోవాలని తెలిపారు. మార్చి 5వ తేదీ లోగా అన్ని పనులను సక్రమంగా నిర్వహించి పంపిణీ కార్యక్రమానికి ఇళ్ళ స్థలాలను సిద్ధం చేయాలని తెలిపారు. ఈ సమావేశానికి శ్రీకాకుళం, పాలకొండ, టెక్కలి రెవెన్యూ డివిజనల్ అధికారులు ఎం.వి.రమణ, టి.వి.ఎస్.జి.కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స ఎ.డి. వై.ఎస్.వెంకటేశ్వర రావు, తహశీల్దారులు, తదితరులు హాజరైనారు.

## కొబ్బరి వలుపు కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు -మంత్రి విశ్వరూప్



అమలాపురం: కొబ్బరి వలుపు కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకొంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ భవన ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు మాజీ సభ్యులు గళ్ళారాము కోనసీమలోని కొబ్బరి కార్మికుల సమస్యల పరిష్కారానికి డివిజన్‌లో కొబ్బరి కార్మికులతో కలసి అమలాపురం రూరల్ మండలం కామనగరువు లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిసి విజ్ఞాపన పత్రాన్ని అందజేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొబ్బరి కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్ళి వాటి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం గళ్ళ రాము కొబ్బరి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొని వచ్చాడు. కోనసీమలోని కొబ్బరి కార్మికులు పని లేక అనేక ఇబ్బందిపడుచున్నారు. ఆటో కార్మికులకు, టైలరింగ్ కార్మికులకు, లాండ్రి కార్మికులకు, చేనేత కార్మికులకు ఆర్ధిక సహాయం చేసిన విధంగా ఈ కొబ్బరి కార్మికులకు కూడా ఆర్ధికంగా ఆదుకొని వారి జీవితాలలో వెలుగులు నింపాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన కొబ్బరి కార్మికులకు పింఛను సౌకర్యం, సంక్షేమబోర్డు మరియు గుర్తింపు కార్డులు ఇప్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు దూనబోయిన కోటేశ్వరరావు, జల్లి సత్యనారాయణ, గొల్లపల్లి సత్యనారాయణ, జిల్లెల్ల సత్యనారాయణ, కుడుపూడి నాగేశ్వరరావు, పల్లా నాగేశ్వరరావు, చింతపల్లి పల్లయ్య లూటుకుర్తి పెద్ద, శీలం శ్రీనివాసరావు, సవరపు బైరవమూర్తి, పెద్దిరెడ్డి ఆదినారాయణ, ముదునూరి ఏసుబాబు, రేలంగి శ్రీరాములు, గుబ్బల వెంకటేశ్వరరావు, విత్తనాల సత్యనారాయణ, ఇందుగుల ప్రసాద్, గుబ్బల ప్రసాద్, యనమదల నాగేశ్వరరావు, విత్తనాల జనార్ధనరావు, లంక వెంకటేశ్వర్లు, సుందరనీడి సత్యనారాయణ, ముత్తాబత్తుల నాగేశ్వరరావు, ఈతకోట పలపురాజు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగం అమలు చేయకపోవడమే సమాజంలో అసమానతలకు కారణం

గోకవరం: ప్రస్తుతం సమాజంలో ఉన్న అన్నిరకాల అపసవ్యతలకు,అసమానతలు అన్నింటికీ కారణం భారత ప్రజలమైన మనం చేసుకున్న ఒప్పందంమైన రాజ్యాంగాన్ని అమలు చేసుకోలేకపోవడమేనని ఫోరమ్ ఫర్ ఆర్ టి ఐ మహిళా అధ్యక్షురాలు కామిరెడ్డి లలితాదేవి పేర్కొన్నారు. గోకవరంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగిన "సమాచార హక్కు చట్టం ఎదుర్కొంటున్న సవాళ్లు" అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు ముఖ్య అతిథిగా హాజరై ఆమె మాట్లాడారు.ప్రజల కొరకు ఏర్పాటు కాబడిన వ్యవస్థలు ప్రజల కొరకు పని చేయనప్పుడు వాటిని సరిచూసుకోవాల్సిన బాధ్యత ప్రజలది, ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులదని,దీనికై పెద్ద ఎత్తున ఒత్తిడి రాకుండా ఆవ్యవస్థలు సక్రమంగా పని చేయవని ఆమె అభిప్రాయపడ్డారు.భారత రాజ్యాంగం ప్రకారం భారతదేశ పౌరులు అందరూ ఈ దేశానికి యజమానులు అంటే ప్రభువులు ఈ దేశంలో ఏం జరగాలో నిర్ణయించాల్సింది ప్రజలే, నిర్ణయించుకునే విషయాలు అమలు అవుతున్నాయో లేదో చూస్తూ ఉండాల్సింది ప్రజలే ఇదే అన్న పదానికి సరైన అర్థం నాటి అంబేద్కర్ నుండి నేటి వరకు సమాజహిత కాంక్షలు ఎందరో చాలా సందర్భాల్లో మన దేశం పరాయి పాలన నుండి విముక్తి చెందినా స్వాతంత్ర్యం పొంద లేదని చెప్పారనీ, నిర్ణయాధికారం ప్రజల చేతిలోకి నిర్వహణ అధికారం పాలకుల చేతిలోకి అనే విధానం ఎంతవరకు అమలు కాదో అంతవరకు ప్రజాస్వామ్యము అమలయినట్లు కాదని కామిరెడ్డి లలితాదేవి తెలిపారు. అధికార వికేంద్రీకరణ జరిగి సంపదను నిర్ణయాధికారం ప్రజల చేతిలో ఉన్నప్పుడే దాన్ని ప్రజాస్వామ్యం అంటే ఈ దేశ ప్రజలంతా అడిగేవారు అంటే ప్రశ్నించేవారు గా ఉండాలని అది రాజ్యాంగ ఆకాంక్ష అని ఈరోజు ఈ దేశ ప్రజలంతా అడిగే వారు కాకుండా అడుక్కునే వారు ఉండి దాన్ని ప్రదర్శించే లేకపోతున్నారనీ ఫోరమ్ ఫర్ ఆర్‌టిఐ రాష్ట్ర న్యాయవిభాగ అధ్యక్షులు ఎన్‌వి.సుబ్బారావు అన్నఎం వి సుబ్బారావు అన్నారు రౌండ్ టేబుల్ సదస్సును ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ భారత దేశ ప్రజలమైన మన అందరి ముందున్న మొట్టమొదటి పని మరియు చిట్ట చివరి పని మనం చేసుకున్న ఒప్పందం అయిన భారత రాజ్యాంగం అమలులోకి వచ్చేలా కృషి చేయాలన్నారు. సమాచార హక్కు చట్టం వజ్రాయుధం అని ప్రజలకు సంబంధించిన ప్రతి రూపాయికి లెక్క చెప్పేందుకే ఉద్యోగులు ఉన్నారని దీనిని ఉపయోగించుకోవాలని సభలో ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.సమాచార హక్కు చట్టంతో 35 లక్షల రూపాయల ఉపాధి హామీ నిధులను ప్రజలకు పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామంలో అర్హులకు అందించినట్లు ఫోరం ఫర్ ఆర్ టి ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరాజు తెలియజేశారు.ఆయన సదస్సును ఉద్దేశించి మాట్లాడారు.ఇంకా సభలో సమాచార హక్కు ఉద్యమకారుడు బత్తిన రామకృష్ణ, జర్నలిస్ట్ కే రామకృష్ణ తదితరులు మాట్లాడారు.చివరిగా ఫోరమ్ ఫర్ ఆర్.టి.ఐ గోకవరం మండల కమిటీని జిల్లా ప్రధాన కార్యదర్శి యు బాలరాజు ప్రకటించారు.గౌరవ అధ్యక్షులుగా కే.రామకృష్ణ మండల కన్వీనర్‌గా మొర్తా చిట్టి బాబు,ఉపాధ్యక్షులుగా యాళ్ళ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులుగా పి. శ్రీనివాస రావు,గొన్నూరి లాజర్, కోశాధికారిగా అయినవిల్లి వర దొర కుమార్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఎం నాగరాజు,ఏ.వీరబాబు,వి.వాసు,ఎం.వెంకట స్వామి ప్రబృతులు ఎన్నికైనట్లు ఆయన ప్రకటించారు. వీరు రెండేళ్లపాటు మండలంలో అన్ని గ్రామాలు పర్యటించి గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి సమాచార హక్కు చట్టం, రాజ్యాంగం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తారని బాలరాజు వివరించారు.చివరిగా ఫోరం ఫర్ ఆర్ టి ఐ జాతీయ మహిళా అధ్యక్షురాలు కామిరెడ్డి లలితాదేవి ఎన్నికైన సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు.





## 60 కోట్ల బడ్జెట్‌తో భక్త కన్నప్ప చిత్రం



నటుడు, నిర్మాతగా రాణిస్తున్న మంచు విష్ణు భారీ బడ్జెట్‌తో పౌరాణిక చిత్రం నిర్మించనున్నాడని కొన్నేళ్ళుగా ప్రచారం జరుగుతూ వస్తుంది. దీనిపై మంచు మోహన్ బాబు శ్రీకాళహస్తి దేవాలయంలో అఫీషియల్ ప్రకటన చేశారు. 60 కోట్ల బడ్జెట్‌తో విష్ణు వర్ధన్ .. భక్త కన్నప్ప అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు అని పేర్కొన్నాడు. ఇందులో నటీనటులు ఎవరు, డైరెక్షన్ ఎవరు చేస్తారనే దానిపై క్లారిటీ ఇవ్వలేదు. విష్ణు ప్రస్తుతం మోసగాళ్ళు అనే క్రైమ్ థ్రిల్లర్ చేస్తున్న సంగతి తెలిసిందే. సైబర్ క్రైమ్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తుంది.

## అనీల్ రావిపూడి నెక్స్ హీరో ఇతనే..!



దర్శకుడు అనీల్ రావిపూడి విజయ ప్రస్థానం పటాస్‌తో మొదలు కాగా, మొన్న వచ్చిన సరిలేరు నీకెవ్వరు చిత్రం వరకు కొనసాగుతూనే ఉంది. కామెడీతో పాటు కమర్షియల్ విలువలు జోడిస్తూ అద్భుతమైన చిత్రాలు తెరకెక్కిస్తున్న అనీల్ రావిపూడి తన తర్వాతి చిత్రాన్ని ఏ హీరోతో చేస్తాడా అని ఇండస్ట్రీలో జోరుగా ప్రచారం జరుగుంది. ఎఫ్ 3 సినిమా చేయనున్నాడనే టాక్ వినిపిస్తున్నప్పటికి, ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కడానికి కొంత సమయం పట్టే ఛాన్స్ ఉంది. ఈ లోపు మెగా హీరోతో ఓ ప్రాజెక్ట్ చేయాలని అనుకుంటున్నాడట అనీల్. రీసెంట్‌గా మెగా హీరో రామ్ చరణ్‌ని కలిసి లైన్ వినిపించగా, దీనికి ఇంప్రెస్ అయిన చరణ్ త్వరలోనే చేద్దామని అన్నాడట. దీంతో చరణ్- అనీల్ రావిపూడి ప్రాజెక్ట్ మేలో సెట్స్ పైకి వెళ్ళనుందని అంటున్నారు. ప్రస్తుతం చరణ్ ఆర్ఆర్ఆర్ అనే చిత్రంతో పాటు చిరు 152వ చిత్రంతో బిజీగా ఉన్నాడు.

## రామ్ సరికొత్త గెటప్‌తో...

రామ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రెడ్'. కిషోర్ తిరుమల దర్శకుడు. శ్రీ స్రవంతి మూవీస్ పతాకంపై రవికిషోర్ నిర్మిస్తున్నారు. ఇటీవలే రెండు పాటల్ని ఇటలీలో చిత్రీకరించారు. ఈ సందర్భంగా నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఇటలీలోని టుస్కాన్, ఫ్లొరెన్స్, డోలమైట్స్ ప్రాంతాల్లో రెండు పాటల్ని తెరకెక్కించాం. డోలమైట్స్ సముద్ర తీర పర్వత ప్రాంతం. సముద్రానికి పదివేల అడుగుల ఎత్తులో మైనస్ ఐదు డిగ్రీల వాతావరణంలో ఓ పాటను చిత్రీకరించాం. ఆ ప్రదేశంలో షూటింగ్ జరుపుకున్న తొలి తెలుగు చిత్రమిది. అక్కడ ఏటా జరిగే వెనీడియా కార్నివాల్‌ను కూడా అనుమతి తీసుకొని కొంతభాగం చిత్రీకరించాం. దీంతో ఓ పాట మినహా షూటింగ్ మొత్తం పూర్తయింది. ఈ



నెలాఖరున హైదరాబాద్‌లో ఆ పాటను తెరకెక్కిస్తాం. ఏప్రిల్ 9న భారీస్థాయిలో విడుదల చేయబోతున్నాం' అన్నారు. 'యాక్షన్ థ్రిల్లర్ కథాంశమిది. ఒకే పోలికలున్న ఇద్దరు వ్యక్తుల నేపథ్యంలో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది' అని దర్శకుడు తెలిపారు. నివేదా పేతురాజ్, మాళవికాశర్మ, అమృతాఅయ్యర్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సమీర్‌రెడ్డి, సంగీతం: మణిశర్మ, దర్శకత్వం: కిషోర్ తిరుమల.



దక్షిణ నియోజకవర్గం, కొత్తజాలరిపేట, విశాఖపట్నంలో నివసిస్తు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బెహరాకి విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాసరావు విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ, 1,75,000/- (అక్షరాలా లక్ష డెబ్భై అయిదు వేల రూపాయలు) ఒమేగా హాస్పిటల్స్ పేరుమీద మంజూరు చేసిన LOC (లెటర్ అఫ్ క్రెడిట్) ని ఛైర్మన్ చేతుల మీదుగా పేషెంట్ బంధువులకు అందజేయడం జరిగింది.

## సత్యదేవుడ్ని దర్శించిన స్టేట్ అడిషనల్ డీజీపి మీనా



అన్నవరంః తూ.గో. జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారిని శనివారం స్టేట్ అడిషనల్ డీజీపి మీనా కుటుంబ సమేతముగా దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఏఈవో ప్రసాద్ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వాదములు అందజేయగా ఏఈవో ప్రసాద్ శ్రీ స్వామివారి ప్రసాదమును అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్లు అనకాపల్లి ప్రసాద్, గొల్లు సత్యనారాయణ లక్ష్మణ స్వామి ఆలయ పర్యవేక్షణ అధికారి పోల్నాటి లక్ష్మీనారాయణ, ప్రత్తిపాడు సిఐ.సన్యాసిరావు, అన్నవరం ఎస్సై మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## కావాలనే మన విమానానికి చైనా అనుమతివ్వడం లేదు..

హైదరాబాద్: కరోనా వైరస్‌కు కేంద్రబిందువైన వుహాన్ నగరానికి వెళ్లవలసిన ఇండియా ఫ్లయిట్‌కు చైనా నుంచి అనుమతి రావడం లేదు. కావాలనే చైనా మన విమానానికి అనుమతి ఇవ్వడంలేదని భారతీయ అధికారులు వెల్లడించారు. సీ-17 గ్లోబ్‌మాస్టర్ మిలిటరీ విమానాన్ని వుహాన్ నగరానికి పంపాలని భారత్ నిర్ణయించింది. వైద్య పరికరాలతో వెళ్లే ఆ విమానం.. అక్కడే ఉన్న కొందరు భారతీయులను వెనక్కి తీసుకురావాలని ప్లాన్ చేసింది. కానీ మన సైనిక విమానానికి.. చైనా క్లియరెన్స్ ఇవ్వడంలేదు. కోవిడ్19 వ్యాధి మరణాలతో బిక్కుబిక్కుమంటున్న చైనాకు భారత్ సహకరించేందుకు ముందుకు వచ్చింది. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌కు కూడా సంఘీభావం తెలుపుతూ మోదీ లేఖ రాశారు. వీలైనంత సహాయం చేస్తామని వెల్లడించారు. కానీ చైనా మన ఫ్లయిట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం లేదని తెలిసింది. మిగతా దేశాలకు చెందిన సహాయ విమానాలు వెళ్లి వస్తున్నాయని, భారత్‌కు మాత్రం అనుమతి ఇవ్వడం లేదని అధికారులు చెబుతున్నారు. రిలీఫ్ ఫ్లయిట్‌కు క్లియరెన్స్ ఇవ్వడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారో?

## రాష్ట్రాభివృద్ధి కోసమే వికేంద్రీకరణ

**వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి**



తాడేపల్లి: రాష్ట్రాభివృద్ధి కోసమే పరిపాలన వికేంద్రీకరణ అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి తెలిపారు. శనివారం ఆయన తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... అమరావతి రైతులను గత టీడీపీ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాతే రైతులకు న్యాయం జరిగిందన్నారు. గత ప్రభుత్వం అవినీతి బయటకు వస్తుందని చంద్రబాబుకు భయం పట్టుకుందన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసమే చంద్రబాబు, ఎల్లోమీడియా ఆరాటమని విమర్శించారు.

అవినీతి బయటపెడితే బీసీల దాడి అంటున్నారని పార్థసారథి ధ్వజమెత్తారు. కేబినెట్‌లో ఐదుగురు డిప్యూటీ సీఎంలను బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చారన్నారు. ఈఎస్ఐ స్కాంలో అచ్చెన్నాయుడు అవినీతి బయటకొచ్చిందన్నారు. గత ప్రభుత్వంలో మంత్రులంతా అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. అక్రమ సొమ్ము మొత్తం చంద్రబాబు వద్దకే చేరిందని ఆరోపించారు. చంద్రబాబు పాత్రపై కూడా సిట్ విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చంద్రబాబు రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీశారని పార్థసారథి మండిపడ్డారు.

# ఘన వ్యర్థాల నిర్వహణలో విశాఖనగరం ఆదర్శంగా నిలవాలి

**విఎమ్ఆర్‌డిఏ ఛైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్‌రావు**



విశాఖపట్నం: స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చెందుతున్న మహా విశాఖనగరం ఘణవ్యర్థాల నిర్వహణ లో ఇతర దేశాలకు ఆదర్శంగా నిలవాలని విఎంఆర్‌డిఏ ఛైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాసరావు అన్నారు. శనివారం మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ, యుఎన్‌డిపి-జిఐజి, ఆంధ్రా యునిర్శిటీ భారతి తీర్థ స్వచ్ఛంద సంస్థ కలసి జివిఎంసి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఘనవ్యర్థాల నిర్వహణపై ఒక రోజు వర్క్‌షాపుకు విఎంఆర్‌డిఏ ఛైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ ఘన వ్యర్థాల నిర్వహణ వర్క్‌షాపులో ముందుగా విఎంఆర్‌డిఏ ఛైర్మన్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న నగరాలలో విశాఖనగరం పరిశుభ్రనగరంగా ఎప్పుడూ ఇతర దేశాలకు దిక్సూచిగా ఉంటుందన్నారు. ముఖ్యంగా ఘనవ్యర్థాలు ఎక్కువగా సముద్ర జలాల్లో కలుషితమవుతున్నాయన్నారు. వాటిని నియంత్రించుటకు ప్రభుత్వం నగరంలో గల మురికి వాడ ప్రాంతాలలో భూగర్భ డ్రైనేజి వ్యవస్థను పూర్తి స్థాయిలో అమలుపరిచేదిశగా చర్యలు చేపట్టిందన్నారు. విశాఖనగరంలో ఘనవ్యర్థాల నిర్వహణకు జివిఎంసి ప్రత్యేకమైన చర్యలు చేపడుతుందన్నారు. ఘణవ్యర్థాల నిర్వహణకు విదేశి సంస్థలు సహకారం అందిస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం జివిఎంసి కమిషనర్ డా.జి.సృజన మాట్లాడుతూ ఘనవ్యర్థాల నిర్వహణ వర్కుషాపులో విదేశి స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారం చాలా అభినందనీయమన్నారు. ఘనవ్యర్థాల నిర్వహణకు ముఖ్యంగా ప్రజల సహకారం చాలా అవసరమన్నారు. ప్రతి ఇంటిలో ప్రతి వ్యక్తి పరిసరాల పరిశుభ్రత వారి బాధ్యతగా భావించాలన్నారు.

అనంతరం భారతీ తీర్థ సంస్థ ప్రతినిధి ప్రకాశం తాతా వాటర్ అండ్ వేస్ట్ మేనేజిమెంటు సావనరీను విఎంఆర్‌డిఏ ఛైర్మన్‌కు, జివిఎంసి కమిషనర్ డా.జి సృజనకు అందించారు. ఐవైఎఫ్ఎస్ స్వచ్ఛంద సంస్థ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనకు చేపట్టిన కార్యక్రమానికి భారతీ తీర్థ సంస్థ అభినందిస్తూ ఆ సంస్థ ప్రతినిధి అప్పలరెడ్డికి ఒక టాటా ఏస్ ట్రక్కును ఉచితంగా బహుకరించారు.

అనంతరం నేషనల్ రిసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్, న్యూఢిల్లీ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టరు పురుషోత్తం మాట్లాడుతూ ఘణవ్యర్థాల నిర్వహణలో భాగంగా చెత్తను రీసైకిల్ చేయడం ద్వారా తయారైన ప్లాస్టిక్ టైల్స్, గృహోపకరణాలు వస్తువులను ప్రదర్శించి, తమ ప్రెజెంటేషన్ ద్వారా చెత్తను పునర్వినియోగించడం అనే అంశాలపై పూర్తి వివరాలను తెలిపారు.

అనంతరం విశాఖపట్నం, ఆర్.కె మిషన్ ముఖ్య ప్రతినిధి స్వామి ఆత్మవిధానంద మాట్లాడుతూ జివిఎంసి పారిశుధ్య కార్మికులు నిత్యం నగరంలో రాత్రి 10 గంటల నుండి తెల్లవారేవరకు రోడ్లను పరిశుభ్రపరుస్తు నగరాన్ని అందంగా తీర్చిదిద్దడంలో ప్రధాన పాత్ర పోషించడం వలన నగరం సుందరంగా తీర్చిదిద్దబడుతుందని తెలిపారు.

అనంతరం భారతీ తీర్థ సంస్థ తరపున రుద్‌అబ్బే, స్వీడన్ తరపున పాల్ మార్ట్‌న్‌సన్ లు జీరో వేస్ట్ విధానాలపై వారి అనుభవాలను ప్రెజెంటేషన్ ద్వారా తెలియపరిచారు. అనంతరం జివిఎంసిలో ఘనవ్యర్థాల నిర్వహణపై ప్రదానవైధ్యాధికారి డా.కె.ఎస్.ఎల్.జి శాస్త్రి యుఎన్‌డిపి ప్రాజెక్టు ఆపీసరు స్వప్న కోటా, సిటి ఆపరేషన్ సెంటర్ నుండి కృష్ణకుమార్ ప్రెజెంటేషన్ ద్వారా వివరాలను తెలియపరిచారు. అనంతరం విశాఖ నగరం నుండి ప్రొ పి.వి.వి. ప్రసాదరావు, ప్రొ. ఎస్ రామకృష్ణారావు, ప్రొ బాలా ప్రసాద్, డా.సాయి సుధాకర్ ప్లాటిపస్ సంస్థ తరపున స్క్యూబా డైవింగ్ నిపుణులు, నివాసిత సంక్షేమ సంఘాల ప్రతినిధి డా.కె.ఎస్.ఆర్ మూర్తి ప్రజెంటేషన్ ద్వారా చెత్తను నియంత్రించడంపై వారి వారి అభిప్రాయాలను తెలియజేశారు.

అనంతరం భారతీ తీర్థ సంస్థ ప్రతినిధి ప్రకాశం తాతా విశాఖలో ఘనవ్యర్థాల నిర్వహణ సక్రమంగా నిర్వహించడం విశాఖనగరం మరింత సుందరంగా తీర్చబడుతుందని ఇతర దేశాలుకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

అనంతరం జివిఎంసి అదనపు కమిషనర్ డా.వి.సన్యాసిరావు మాట్లాడుతూ జివిఎంసిలో నిర్వహిస్తున్న ఘనవయర్థాల నిర్వహణపై భవిష్యత్తు లో చేపట్టబోయే ప్రణాళికలు, కార్యాచరణను తెలియజేశారు.

ఈ వర్క్ షాపులో జివిఎంసి అదనపు కమిషనర్ తమీమ్ అన్సారియా, ప్రొ. వి.బాలమోహన్‌దాస్, అనకాపల్లి జోనల్ కమిషనర్ శ్రీరామమూర్తి, ఎఎంఓహెచ్‌లు డా.ఎస్ జయరాం, రాజేష్, లక్ష్మీతులసి, ఎడిహెచ్ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## వర్సిటీని సందర్శించిన అమెరికా ప్రతినిధులు పరస్పర సహకారంపై చర్చ



ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆంధ్రవిశ్వ విద్యాలయాన్ని అమెరికా దేశ ప్రతినిధులు శనివారం సదర్శించారు. అమెరికాలోని గ్లోబల్ ఎక్విప్‌మెంట్ అద్యక్షులు డాక్టర్ డాన్ స్టాల్‌డార్ఫ్, కింగ్స్ పార్క్ ఇంటర్నేషనల్‌కు చెందిన డాక్టర్ జెఫ్ వుబెన్‌హార్స్ట్‌లు సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. అంతర్జాతీయ విద్యాసంస్థలలో అవగాహన ఒప్పందాలు, సంయుక్తంగా పనిచేయే దిశగా చర్చలు జరిపారు.

మే, జూన్ మాసాలలో అమెరికాకు విచ్చేయాలని వీసీ ప్రసాద రెడ్డిని అమెరికా ప్రతినిధులు ఆహ్వానించారు. పరిశోధనల, బోధన రంగాలలో కలసి పనిచేయాలని స్వాగతించారు. కార్యక్రమంలో లవ్ అండ్ కేర్ మినిస్ట్రీస్ అద్యక్షులు యేసుపాదం, డాక్టర్ జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ తరపున అమెరికా ప్రతినిధులను వీసీ సత్కరించారు.

## కాంగ్రెస్ పార్టీ రివ్యూ ఎన్నికల మ్యానిఫెస్టోపై సమీక్ష సమావేశం

**ముఖీల్ వాషనిక్ హామీలు అమలు**

**కిరణ్ బేడీ ఆటంకంగా మారింది - మంత్రి మల్లాడి**



యానాంః కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి వ్యాప్తంగా 2016 అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ ఎంత వరకు అమలు చేసింది అనే విషయంపై పుదుచ్చేరి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్చార్జ్ మాజీ కేంద్రమంత్రి ముఖీల్ వాషనిక్ సమక్షంలో సమీక్ష సమావేశం నిర్వహించారు పుదుచ్చేరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పుదుచ్చేరి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పుదుచ్చేరి పార్లమెంటు సభ్యుడు వైద్యలింగం, కేంద్ర మాజీ మంత్రి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ ముఖీల్ వాషనిక్, పుదుచ్చేరి ముఖ్యమంత్రి వి నారాయణ స్వామి అసెంబ్లీ స్పీకర్ శివ కోలంధ్, మంత్రులు నమశ్శివాయ, మల్లాడి కృష్ణారావు, కందస్వామి, కమల్‌కన్నన్, షాజహాన్, ఎమ్మెల్యేలు. పార్టీ ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మేనిఫెస్టోలోని హామీలు ఇప్పటివరకు ఎన్ని అమలు చేశారు? పూర్తి స్థాయిలో హామీలు అమల జరగకపోవటానికి గల కారణాలు? తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీ గవర్నరుగా బాధ్యతలు స్వీకరించినప్పుడు నుండి పుదుచ్చేరి అభివృద్ధికి సంక్షేమ కార్యక్రమాలకు ఆటంకంగా మారింది అన్నారు క్యాబినెట్ తీసుకుంటున్న నిర్ణయాలను అడ్డుకుంటూ ప్రజా సంక్షేమానికి ఆటంకంగా మారిందని, ఆమె పార్టీని ప్రభుత్వాన్ని ఇబ్బందులు కలగ చేయాలని దురుద్దేశంతో నియంత పాలన సాగిస్తోందని అన్నారు.

## ఘనంగా జాగరణ.. పుణ్యస్నానాలు





విశాఖపట్నం : మహా శివరాత్రి నేపథ్యంలో శుక్రవారం రాత్రి జాగరణ చేసిన భక్తులు శనివారం తెల్లవారుజాము నుంచి సముద్రంలో పుణ్య స్నానాలు చేశారు. రాత్రం తా మెలకువతో ఉండి హరి నామ స్మరణ చేసి ఉదయాన్నే పుణ్యస్నానం చేస్తే స్వర్గలోక ప్రాప్తి ఉంటుందని పురాణాలు చెబు తున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్ కే బీచ్ సహ పలు తీరప్రాంతాల్లో వేలాది మంది భక్తులు పుణ్యస్నాన మాచరించారు. కొంతమంది పితృదేవతలకు తర్పణాలు అర్పించారు. సూర్య దేవుడికి మొక్కులు చెల్లించారు. యువత ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొని అనంతరం స్నానాలు చేశారు. పిల్లా పాపలతో కుటుంబాలన్నీ బీచ్ కు వచ్చి కొద్దిసేపు కలియ తిరుగుతూ స్నానమాచరించారు. పిల్లలు ఇసుక తిన్నెలపై ఆటలాడుతూ ఆలయాల నమూనాలు చేస్తూ, పూజలు నిర్వహించారు. అదే ప్రాంతంలో శుక్రవారం అంతా డాక్టర్ టీఎస్సార్ కళాపరిషత్ ఆధ్వర్యంలో మహా కుంభాబిషేకం నిర్వహించడంతో భక్తులు పోటెత్తారు. రాత్రంతా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో భక్తులు క్యూ కట్టారు. పోలీ సులు భారీ బందోబస్తు నిర్వహించారు. జీవీఎంసీ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది.





VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com